## విమానాశ్రయంలో రూ.2.2 కోట్ల నిషేధిత కలుపు మొక్కల పట్టివేత..

హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా నిషేధిత కలుపు మొక్కలను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. హైడ్రోఫోనిక్ కలుపు మొక్కలను అధికారులు సీజ్ చేశారు. పట్టుబడిన కలుపు మొక్కల విలువ సుమారు రూ. 2.2 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. బ్యాంకాక్ నుంచి ఓ ప్రయాణికుడు తన ట్రాలీ బ్యాగ్ లో కలుపు మొక్కలను దాచి తరలించే యత్నం చేశాడు. ఇవాళ ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు బ్యాంకాక్ నుంచి విమానం ల్యాండ్ అయ్యింది. అయితే బ్యాంకాక్ నుంచి ఓ ప్రయాణికుడు అనుమానాస్పదంగా వెళ్లడం గమనించారు కస్టమ్స్ అధికారులు. అతని ట్రాలీ బ్యాగ్ ను తనిఖీ చేయగా షాక్ కు గురయ్యారు. లగేజ్‌బ్యాగ్ లో నిషేధిత కలుపు మొక్కలు దాచి ఉండటం అధికారులు గుర్తించారు. నివాటి స్వాధీనం చేసుకుని ప్రయాణికుడిని అదుపులో తీసుకున్నారు. అతనిపై NDPS యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో వున్న వ్యక్తులుతో డీల్ కుదుర్చుకున్నాడా? అనే అనుమానంతో ఆరా తీస్తున్నారు. ప్రయాణికుడి మొబైల్ స్వాధీనం చేసుకుని కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :241 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 30-11-2024 | పేజీలు:4 వెల: 2.00


# ఇథనాల్ పరిశ్రమకు అనుమతిచ్చింది కెసిఆరే



హైదరాబాద్ :నిర్మల్ జిల్లా దిలావర్పూర్ ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటునకు అనుమతులిచ్చింది కెసిఆర్ ప్రభుత్వమేనని తేల్చి చెప్పింది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. ఈ మేరకు అప్పుడు విడుదల చేసిన జీవోలను నేడు మీడియాకు అందజేసింది. 2023, డిసెంబర్ 7కు ముందే టీఎస్–ఐపాస్ ద్వారా ఆ కంపెనీకి అనుమతులు జారీ అయినట్లు సర్కార్ పేర్కొంది. పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే కేంద్రం అనుమతి ఇచ్చిందని, అయితే దానిని ఆధారం చేసుకుని ఇథనాల్, ఎక్స్ ట్రా న్యూటల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్జల్యూట్ ఆల్కహాల్ లాంటి అన్ని ఉత్పత్తులకు అప్పటి కెసిఆర్ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వెల్లడించింది రేవంత్ సర్కార్ .

అడ్డగోలు అనుమతులు

కేసీఆర్ ప్రభుత్వం పీఎంకే కంపెనీకి అనుకూలంగా మంత్రివర్గంలోనే అడ్డగోలు అనుమతులు జారీ చేసిందని రేవంత్ సర్కార్ చెబుతోంది. ఫ్యూయల్ ఇథనాల్ సాకు చూపించి ఏకంగా ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా మినహాయింపు పొందేందుకు ఇథనాల్ కంపనీ అడ్డదారులు తొక్కినట్లు గుర్తించింది. కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతి ప్రకారం అక్కడి స్థానిక సంస్థల నుంచి ఎన్‌వోసీ తీసుకోవడం తప్పనిసరి. ఎన్‌వోసీ తీసుకోకుండానే పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అప్పట్లోనే నిర్మాణాలను ప్రారంభించినట్లు గుర్తించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అండదండలతోనే పర్యావరణ అనుమతుల నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘించిందనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆరోపిస్తున్నది.

కేబినెట్ అనుమతి లేకుండానే

2022, అక్టోబర్ 22న 600 లక్షల లీటర్ల ఇథనాల్ / ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్/ ఇండస్ట్రియల్ స్పిరిట్స్ / అబ్సల్యూట్ ఆల్కహాల్ తయారీకి లెటర్ ఆఫ్ ఇండెంట్ కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసింది. అప్పటి ప్రభుత్వం కేబినేట్ ఆమోదం లేకుండానే అత్యవసరం పేరిట ఆదేశాలు జారీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. 2022 డిసెంబర్‌లో ఆ నిర్ణయాన్ని కేసీఆర్ కేబినెట్ ర్యాటిఫై చేసింది. ఇథనాల్ తయారీకి కేంద్ర ప్రభుత్వంతో పాటు పర్యావరణ అనుమతి తప్పనిసరి. ఇథనాల్ / ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ / ఇండస్ట్రియల్ స్పిరిట్స్ / అబ్సల్యూట్ ఆల్కహాల్ తయారీకి పీఎంకే డిస్టిలెషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లెటర్ ఆఫ్ ఇండెంట్ తీసుకుంది.. కానీ కేంద్ర పర్యావరణ శాఖకు మాత్రం"ఫ్యూయల్ ఎథనాల్" కోసమే దరఖాస్తు చేసినట్లు విచారణలో బయటపడింది. అక్కడ ప్రతిపాదించిన 300 కేఎన్‌పీడీ సామర్థ్యం మొత్తం "ఫ్యూయల్ ఇథనాల్" తయారీకేనని కంపెనీ స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించింది. కంపెనీ సమర్పించిన స్వీయ ధ్రువీకరణ ఆధారంగా ఈ ఫ్యాక్టరీ బీ2 కేటగిరీకి వస్తుందని.. ప్రజాభిప్రాయ సేకరణ నుంచి అప్పటి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. 2023 ఫిబ్రవరి 24 కేంద్ర పర్యావరణ శాఖ కేవలం ఫ్యూయల్ ఇథనాల్ ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్ 1న ఆ ఫ్యాక్టరీకి ఇచ్చిన లెటర్ ఆఫ్ ఇండెంట్లో ఫ్యూయల్ ఇథనాల్‌కు పరిమితం కాలేదు. మిగతా ఉత్పత్తులన్నీ జోడించిన లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసింది.

నిబంధనల ఉల్లంఘన..

కొత్త లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను చూపించి 2023 జూన్ 7న ఇథనాల్ / ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్/ ఇండస్ట్రియల్ స్పిరిట్స్ / అబ్సల్యూట్ ఆల్కహాల్ ఉత్పత్తుల తయారీ లైసెన్స్‌కు పీఎంకే కంపెనీ దరఖాస్తు చేసుకుంది. పర్యావరణ శాఖ అనుమతి ప్రకారం అక్కడి స్థానిక సంస్థల నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (NoC) తీసుకోవటం తప్పనిసరి. కానీ పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ స్థానికంగా అనుమతి తీసుకోకుండానే కాంపౌండ్ వాల్ నిర్మించేసింది. దీంతో పర్యావరణ అనుమతుల నిబంధనలను ఉల్లంఘించింది సదరు కంపెనీ. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన లెటర్ ఆఫ్ ఇండెంట్ ఆధారంగా 2023 జూన్ 15న ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఆదిలాబాద్ చీఫ్ ఇంజనీర్ విభాగం నీటి కేటాయింపులకు అనుమతి ఇచ్చినట్లు విచారణలో అధికారులు గుర్తించారు. దీనిపై సమగ్ర విచారణకు రేవంత్ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

# రెండు రోజుల్లో సీఎంపై నిర్ణయం : ఏక్‌నాథ్ షిండే

ముంబై:మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడై వారం రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకూ సీఎం ఎవరన్న సందిగ్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఒకటి లేదా రెండు రోజుల్లో దీనిపై ప్రకటన వస్తుందని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తాజాగా వెల్లడించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన (ఏక్ నాథ్ షిండే), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లతో కూడిన మహాయుతి కూటమికి మెజారిటీ వచ్చినా సీఎం ఎవరన్న సంగతి తేలలేదు. సీఎం అభ్యర్థి ఖరారు విషయమై గురువారం దేశ రాజధానిలో బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ మిత్రపక్షాల భేటీ జరిగింది. ఈ భేటీ అనంతరం షిండే మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డాతో సానుకూల చర్చలు జరిగినట్లు తెలిపారు. సీఎం పదవిపై ఒకటి లేదా రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై ముంబైలో మరోసారి చర్చించిన అనంతరం నిర్ణయం ప్రకటించనున్నట్లు తెలిపారు. మిత్రపక్షాల మధ్య మంచి సమన్వయం ఉందన్నారు. త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కూటమిలోని బీజేపీకి 132 సీట్లు, షిండే సేనకు 57, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 41 సీట్లు దక్కాయి. ఈ నేపథ్యంలో అత్యధిక సీట్లు సాధించిన బీజేపీనే ఈసారి సీఎం పదవి చేపట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా ఉన్న బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీసే మహా తదుపరి ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయమైనట్లు



సమాచారం. ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం ఈ మేరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పాటు ఎన్డీఏ పక్షాలకు స్పష్టతనిచ్చినట్లు తెలుస్తున్నది. ఇక ముఖ్యమంత్రితోపాటు సగానికిపైగా మంత్రి పదవులను బీజేపీ తన వద్దే ఉంచుకోనున్నట్లు తెలిసింది. మహారాష్ట్రలో సీఎంతో సహా అత్యధికంగా 43 మంది మంత్రులను నియమించుకునే వీలుంటుంది. ఇందులో షిండే నేతృత్వంలోని శివసేనకు 12, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 9 మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇందులో షిండే వర్గానికి మూడు కీలక మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పట్టణాభివృద్ధి, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, జలవనరులు లభించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది.

# తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా దీక్షా దివస్..



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి నేటితో 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ జరుపుతున్నాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని రంగదాంపల్లిలో అమరులవీరుల స్థూపం దగ్గర అంజలి ఘటించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న దీక్షా దివస్ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ యాదవ్, జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. వరంగల్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా క్లాక్ టవర్ సెంటర్‌లో జిల్లా ఇన్‌చార్జి మన్నెం శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మాజీ మంత్రి రెడ్యానాయక్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తదితరులు దీక్షా దివస్‌లో పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, ఇతర నేతలు దీక్షా దివస్ నిర్వహించారు. ములుగు జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆధ్వర్యంలో దీక్షా దివస్ జరుగుతోంది. మెదక్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో దీక్షా దివస్ వేడుకలు జరుగుతున్నాయి. జనగామ జిల్లాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు.

కేసీఆర్ చిత్తశుద్ధి, నిబద్ధత వల్లే రాష్ట్రం సిద్ధించింది

హైదరాబాద్, నవంబర్ 29 : కేసీఆర్ చిత్తశుద్ధి, నిబద్ధత వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అని నినాదమిచ్చి రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ గారు తెగించిన రోజు నవంబర్ 9 అని చెప్పారు. తెలంగాణ ప్రజలే శ్వాసగా, తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ఉద్యమం సాగించి.. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన సందర్భమన్నారు. ఇన్నేండ్లు గడిచినా ఆ నాటి పరిస్థితులు ఇంకా తన ముందు కదలాడుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ త్యాగాల ఫలం తెలంగాణ, కేసీఆర్ ఉద్యమ ఫలితం తెలంగాణ అని ఎక్స్ వేదికగా వెల్లడించారు. "తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అని నినాదమిచ్చి రాష్ట్ర సాధన కోసం మృత్యువును సైతం ముద్దాడేందుకు కేసీఆర్ గారు తెగించిన రోజు నేడు. తెలంగాణ ప్రజలే శ్వాసగా, తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ఉద్యమం సాగించి..స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన సందర్భం. ఇన్నేళ్ళు గడిచినా ఆ నాటి పరిస్థితులు ఇంకా నా ముందు కదలాడుతూనే ఉన్నాయి. కేసీఆర్ గారి చిత్తశుద్ధి, నిబద్ధత వల్లే రాష్ట్రం సాధ్యమైంది. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారు తన 1996–2012' పుస్తకంలో కెసిఆర్ గారి నిబద్ధత గురించి ఇలా ప్రస్తావించారు. కేంద్ర మంత్రిగా మీకు ఏ శాఖ కేటాయించాలి అని అడిగినప్పుడు కేసీఆర్ గారు ఇచ్చిన సమాధానం.. "ప్రణబ్‌జీ, నా లక్ష్యం మీకు తెలుసు. నాకు ప్రత్యేక తెలంగాణ కావాలి. మీరు నాకు ఏ శాఖను కేటాయించారనేది ముఖ్యం కాదు. మీరేది కేటాయించినా నాకు సమ్మతమే. కానీ దయచేసి తెలంగాణను ఇవ్వండి." ఇదీ కేసీఆర్ అంటే. ఇదీ ఆయన కమిట్మెంట్. కేసీఆర్ త్యాగాల ఫలం తెలంగాణ. కెసిఆర్ ఉద్యమ ఫలితం తెలంగాణ. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# సంభల్ మసీదులో సర్వేపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: యూపీలోని సంభల్‌లో ఉన్న షాహీ ఈద్గా మసీద్‌లో సర్వే చేపట్టేందుకు స్థానిక కోర్టు ఇచ్చిన ఆదేశాలను నిలిపివేయాలని కోరుతూ ఆ మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ట్రయల్ కోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ.. అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని మసీదు కమిటీకి ఇవాళ సుప్రీంకోర్టు సూచించింది. షాహీ ఈద్గా మసీదు వద్ద గతంలో హరిహర హిందూ దేవుళ్ల ఆలయం ఉన్నట్లు వేసిన పిటీషన్ ఆధారంగా సర్వే చేపట్టేందుకు ట్రయల్ కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇవాళ సుప్రీంకోర్టు ఆ కేసులో స్పందిస్తూ.. శాంతి, సామరస్యాన్ని పాటించాలని అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాల్లో కోరింది. ఈ కేసులో హైకోర్టు వాదనలు వినేంత వరకు.. ట్రయల్ కోర్టు ఆదేశాలను అమలు చేయరాదు అని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఈ కేసును పెండింగ్‌లో పెడుతున్నామని, అక్కడ ఏమీ జరగాల్సిన అవసరం లేదని, మనం తటస్థంగా ఉండాలని, అక్కడ ఏమీ జరగకుండా చూడాలని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. ఈ కేసును హైకోర్టు సమీక్షించేంత వరకు.. జనవరి 8వ



తేదీన జరగాల్సిన ట్రయల్‌కోర్టు విచారణ కూడా జరగదని సుప్రీం చెప్పింది. మసీదులో సర్వే చేయాలని స్థానిక కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో వారం క్రితం సంభల్‌లో హింసాత్మక ఆందోళనలు చెలరేగాయి. స్థానికులు, పోలీసుల మధ్య హింస చోటుచేసుకున్నది.

# వైఎస్ భాస్కర్ రెడ్డికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ



న్యూఢిల్లీ,నవంబర్ 29 : వైఎస్ భాస్కర్ రెడ్డికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడు భాస్కర్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో భాస్కర్ రెడ్డికి హైకోర్టు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సీబీఐ సుప్రీంలో పిటీషన్ దాఖలు చేసింది. దీనిపై శుక్రవారం సిజెఐ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అనంతరం భాస్కర్ రెడ్డికి నోటీసులు జారీచేస్తూ... తదుపరి విచారణ మార్చికి వాయిదా వేసింది. కాగా వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును సీబీఐ విచారిస్తోంది. దాదాపు హత్య జరిగి ఐదేళ్లు గడిచినా ఈ దారుణానికి ఒడిగట్టింది ఎవరనే దానిపై అధికారికంగా స్పష్టత రాలేదు. ఈ హత్య చేసిందేవరో కోర్టు తుది తీర్పు తర్వాతనే తేలనుంది. సీబీఐ సుదీర్ఘకాలంగా కేసును విచారిస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి అరెస్ట్ తర్వాత ఈ కేసు విచారణలో స్పీడ్ తగ్గింది. వాస్తవానికి వైఎస్ అవినాష్ రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేయడానికి ప్రయత్నించినా.. కుదరలేదు. చివరికి తెలంగాణ హైకోర్టులో ఆయన ముందస్తు బెయిల్ పొందడంతో అవినాష్ అరెస్ట్ విషయం వెనక్కి వెళ్లిపోయింది. ఇంత జరుగుతున్నా.. వివేకానంద రెడ్డి హత్య ఎందుకు జరిగింది.. ఈ హత్యలో ఎవరు పాత్రదారులు.. ఎవరు సూత్రదారులు అనేది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. చట్టప్రకారం దర్యాప్తు సంస్థలు విచారణ పూర్తి చేసి సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించిన తర్వాత.. న్యాయస్థానం తీర్పు తర్వాత ఈ హత్యలో దోషులు ఎవరో అధికారికంగా తేలుతుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు సీబీఐ విచారణ మందగించింది. ఓవైపు ఎన్నికల సమయం కావడంతో కొంత గ్యాప్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్లుగా సీబీఐ ఈ కేసులో అసలు నిందితులను అరెస్ట్ చేసే ప్రయత్నం చేసినా.. గత వైసీపీ ప్రభుత్వం ఏదో విధంగా వారి విధులకు ఆటంకం కలిగిస్తూనే ఉందనే ఆరోపణలు ఉన్నాయి. నిందితులను కాపాడేందుకు జగన్ తీవ్రంగా ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తు సక్రమంగా జరగకుండా మాజీ సీఎం జగన్ కుట్రలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఏకంగా సీబీఐ అధికారులపై కేసులు నమోదు చేసిన సందర్భాలు చూశాము. దర్యాప్తు సంస్థల అధికారుల నైతికతను, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం గత వైసీపీ ప్రభుత్వం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వైసీపీ అధికారంలో లేదు. జగన్ ప్రజల మద్దతును కోల్పోయారు. ఈ నేపథ్యంలో సీబీఐ వివేకా కేసు దర్యాప్తును వేగవంతం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## అదుపు తప్పి
## హైవే బ్రిడ్జి అంచుకు ఆర్‌టీసీ బస్సు

హైదరాబాద్, నవంబర్ 29: జాతీయ రహదారి 161పై ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం కన్సాన్ పల్లి దగ్గర శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే బస్సు బ్రిడ్జి రెయిలింగ్ పైకి ఎక్కి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద సమాచారం అందిన వెంటన పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గాయపడిన ప్రయాణికులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన ప్రయాణికులను వేరే బస్సుల్లో వారి గమ్య స్థానాలకు చేర్చారు.

# తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్‌కే ఉంది..

హైదరాబాద్, బీఆర్ఎస్ పార్టీకి పునర్జన్మ ఇచ్చింది కరీంనగర్ అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్ అని తెలిపారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా మరోసారి పోరాట బాట పట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనదని కేటీఆర్ కొనియాడారు. కేసీఆర్ పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేసినట్లు తెలిపారు. కేసీఆర్ అనేది పేరు కాదు.. తెలంగాణ పోరు అని పేర్కొన్నారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించామని చెప్పారు. కానీ ఆనాడు ఉద్యమంలో అడ్రస్ లేని వారు ఇవాళ తెలంగాణ గురించి మాట్లాడుతున్నారు. ఆనాడు ఉద్యమంలో మన మీదకు తుపాకీ తీసుకొచ్చినోడు ఇవాళ మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కుతినే వాళ్లని తెలంగాణ ప్రజల గురించి మాట్లాడటానికి అన్నారు. రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు.. అధికారం ఆయన దగ్గర ఉందని కేటీఆర్ అన్నారు. అధికారం నీ దగ్గర ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్‌కు, గులాబీ జెండాకే అని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపించారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. దొంగ మాటలు, నంగనాచి కబుర్లు చెప్పి.. ఏ రోజుకైనా తెలంగాణ చరిత్ర రాసిన రోజు కేసీఆర్




హిమాలయ పర్వతమంతా ఎత్తులో ఉంటే.. కనీసం ఆయన కాలి గోటికి సరిపోని పాత్రలో ఉంటావనేది అక్షర సత్యమని చెప్పారు. దమ్ముంటే నీ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలో ఏ ఊరికైనా, ఏ తండాకైనా, ఏ బస్తీకైనా వెళ్లమని సవాలు విసిరారు. కాంగ్రెస్ ఏడాది పాలనతో తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని కేటీఆర్ అన్నారు. ఆఖర గురుకులాల్లో ఉంటే కూడా ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని పిల్లలు కనిపించారు. హాస్టల్‌లో బువ్వ తిని ఆసుపత్రి పాలయ్యే పరిస్థితి లేదు. హాస్టల్ విద్యార్థులు తిండి కోసం అలమటిస్తున్నారని అన్నారు. ఇది ఏడాది పాలనలో రాష్ట్ర పరిస్థితి అని అన్నారు.

## సంపాదకీయం

శనివారం 30-11-2024

# మూలాల్లోకి వెళ్లాలి

ఫుడెక్కడుందో.. మందక్కడే వేయాలంటారు పెద్దలు. అప్పుడే అది తగ్గుతుంది. ఈపని చేయకపోవటం వల్లే రాష్ట్రంలో ఇప్పుడు ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతమవుతున్నాయి. ఫలి తంగా విద్యార్థులు బలైపోతున్నారు. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు మధ్యాహ్న భోజనం వికటించింది. మొత్తం ఎనభై మంది పిల్లలు ఆస్పత్రి పాలయ్యారు. ఇలాంటి ఘటనలే రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల చోటు చేసుకోవటం ఆందోళనాకరం.మాగనూరు పాఠశాలకు సంబంధించి మొదటి ఘటన అశ్రద్ధ, నిర్లక్ష్యం వల్లే సంభవించిందని చెప్పక తప్పదు. పౌర సరఫరాలశాఖ సరఫరా చేసిన బియ్యాన్ని బాగు చేయకుండా (గ్రేడింగ్) నేరుగా వండితే పురుగులు రాకుండా ఇంకేం వస్తాయంటూ ప్రశ్నిస్తున్నారు ఆహార నిపుణులు. అందువల్ల ఆ ఒక్క పాఠశాలే కాదు%ూ%తెలంగాణలోని మిగతా బడుల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది సైతం పిల్లలకు పెట్టే భోజనం విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఇదే సమయంలో అదే పాఠశాలలో సోమవారం నాటి ఘటనపై విచారణకు వెళ్లిన స్థానిక తహశీల్దార్, అక్కడి ఉపాధ్యాయులు కూడా వాస్తవాలను తెలుసుకునేందుకు వీలుగా విద్యార్థులకు వడ్డించిన భోజనాన్నే తినటాన్ని మనం అభినందించాల్సిందే. ఇదే శ్రద్ధ, చొరవతో అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అటు ప్రభుత్వానిది, ఇటు ఉపాధ్యాయులది కూడా.ఇక గురుకులాల విషయానికొస్తే%ూ% గత ప్రభుత్వ విధానపరమైన లోపాలు, నిర్ణయాలు%ూ% నేటి రేవంత్ సర్కారుకు శాపాలుగా మారాయి. బీఆర్ఎస్ సర్కారు హడావుడిగా, అనాలోచితంగా ప్రారంభించిన గురుకులాల్లో అత్యధికం అద్దెభవనాల్లో కొనసాగుతుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,022 గురుకులాలు ఉంటే%ూ% వాటిలో సగానికి పైగా అంటే 660 అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వీటిలో వంటశాలలు, బియ్యం, కూర గాయలు, ఇతర సామగ్రి భద్రపరుచుకు నేందుకు ప్రత్యేకంగా స్టోర్ రూమ్‌లంటూ ఏమీ లేవు. దీంతో అవన్నీ పాడైపోతున్నాయంటున్నారు అక్కడి సిబ్బంది. దీనికితోడు వంటల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కేర్ టేకర్లుగానీ, వార్డెన్లు గానీ లేకపోవటం విద్యార్థులకు శాపంగా మారింది. ఫలితంగా పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులే ఇటు వంటలను, అటు బోధనను చూసు కోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో రెండింటిలో ఏ ఒక్క దానిమీద కూడా పూర్తి శ్రద్ధను పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు టీచర్లు. అంతిమంగా ఇది విద్యా ప్రమాణాల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోందని తేలింది.ఇలాంటి పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంతే పర్యవేక్షిస్తోన్న నేపథ్యంలో ఆయన భుజాలపై ఇప్పుడు బృహత్తర బాధ్యత ఉంది. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన దరిమిలా%ూ% సీఎం నేరుగా రంగంలోకి దిగి, సమస్యలకు గల మూల కారణాలను వెతకాలి. వాటి మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. గురుకులాలు, ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలందరూ పేదలు, బలహీనవర్గాలకు చెందిన వారు కాబట్టి, వారికి సమయానికి మధ్యాహ్న భోజనాన్ని అందించటమేగాదు, అది నాణ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సర్కారుదే.నేటి బాలలే రేపటి పౌరులు వారు చదువులు, ఆటపాటల్లో రాణించాలంటే పౌష్టికాహారం అవసరం. అది లేకే వందలాది మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని సర్కారు గుర్తెరగాలి. ప్రభుత్వ బడులపై పకడ్బందీ పర్యవేక్షణ ఉండేలా చేయటం ద్వారా ఈ సమస్యల నుంచి విద్యార్థులను బయటపడేయొచ్చు. అందుకోసం విద్యా రంగానికి చాలినన్ని నిధులు కేటాయించాలి. సొంత భవనాలు నిర్మించాలి, సరిపడా సిబ్బందిని నియమించాలి. ఆ దిశగా సర్కారు ప్రయత్నాలు ప్రారంభించాలి. లేదంటే మాగనూరు లాంటి ఘటనలు మరిన్ని పునరావృతమయ్యే అవకాశం లేకపోలేదు.

# ధనిక దేశాల దురాశ ...మొక్కుబడిగా 'కాప్' సదస్సులు




ప్రపంచ వాతావరణ సదస్సు కాప్-29 అజర్ బైజాన్‌లోని బాకులో జరిగింది. నవంబర్ 11-22 మధ్య జరుగాల్సిన ఈ సదస్సును అంతర్గత విభేదాలు, వాగ్వివాదాల వల్ల రెండు రోజులు పొడిగించారు. అయినా వాతావరణ మార్పులను సమష్టిగా ఎదుర్కోవాలన్న లక్ష్యం నీరుగారిపోయిందని వర్ధమాన దేశాలు నిరసిస్తున్నాయి. గ్లోబల్ వార్మింగ్ అనేది, ఇంకేమాత్రమూ శీతల దేశాల శాస్త్రీయ చర్చలకో, ఎవరో కొందరు లకైమెట్ శాస్త్రవేత్తల హెచ్చరికలకో పరిమితమైనది కాదు. ఆ ఫలితాలను ఇప్పుడు స్వయానా అనుభవిస్తున్నాం. ఉత్తర భారతం లోనే కాదు, యూరోప్‌లో కూడా ఉష్ణోగ్రతల రికార్డులు బద్దలవుతున్నాయి. భూ ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ తగ్గించాలనే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. సగటు ఉష్ణోగ్రతలను, 20 ఏళ్లకు లెక్కించి చెప్పాలనే సాంకేతిక కారణం పక్కన పెడితే, ఇప్పటికే 1.5 డిగ్రీల మార్పును దాటేశాము. వాతావరణ మార్పుల తీవ్రత వల్ల చాలా ప్రాంతాలు నివాసయోగం కాకుండా పోతున్నాయి. వాతావరణ విపరీతాల వల్ల దిగువ ప్రాంతాలే కాక, అన్ని ప్రాంతాలకూ తీవ్రమైన నష్టం జరుగుతోంది. చరిత్రలో ఒక లక్షా 25 వేల సంవత్సరాలకు ముందు మనుషులు ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆఫ్రికాను వదిలి యురేషియాకు పోతున్న సందర్భం అది. ఇప్పుడు మళ్లీ ఈ వాతావరణ అస్థిరతలు ఎక్కడికి దారితీస్తాయో, అర్థం కాని పరిస్థితి ఉంది. ధనిక దేశాలు బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాలను దీర్ఘకాలంగా వాడుతున్నాయి. ఇది భూగోళం వేడెక్కడానికి కారణమవుతోంది. దీనివల్ల సముద్రాలు పొంగి ద్వీపదేశాలు ముంపునకు గురవుతున్నాయి. అవి క్రమంగా అదృశ్యమయ్యే ప్రమాదముంది. వాతావరణ మార్పులు తెచ్చిపెడుతున్న వరదలు, తుపానులు, అనావృష్టి వంటివి పేద దేశాలను ఎక్కువగా నష్టపరుస్తున్నాయి. ఈ నష్టాలకు పరిహార నిధిని ఏర్పాటు చేస్తారనీ, దాని పరిమాణాన్ని కాప్-29లో నిర్ణయిస్తారని ఆశించారు. భూతాపానికి దారితీస్తున్న కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు కొత్త మార్గాలను గుర్తిస్తారనీ భావించారు. భూఉష్ణోగ్రత పెరుగుదల 2030కల్లా 1.5డిగ్రీల సెల్సియస్ ను చేరుకుని, ఆపైన మించిపోవచ్చని ఐరాస అనుబంధ సంస్థ యూఎన్ఈపీ తాజా నివేదిక హెచ్చరించింది, దీన్ని నివారించడానికి కాప్-29 దిశానిర్దేశర చేస్తుందని అందరూ విశ్వసించారు. వాతావరణ మార్పుల నిరోధానికి గతంలో క్యోటో, పారిస్, గ్లాస్గో, దుబాయ్ సదస్సుల్లో తీసుకున్న నిర్ణయాల అమలుకు కాప్-29 గట్టి చర్యలు తీసుకొంటుందనీ భావించారు. భూతాపానికి బాధ్యులైన సంపన్న దేశాలు మరింత ఎక్కువ బాధ్యత తీసుకుని శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించాలనే డిమాండ్ ఉంది. వాతావరణ మార్పుల వల్ల నష్టపోతున్న తమకు భారీగా ఆర్థిక సాయం చేయాలనీ పేద దేశాలు కోరుతున్నాయి. ఇందుకోసం కాప్-29 సదస్సులో ఎక్కువ నిధులిస్తూ నూతన సమష్టి పరిమాణాత్మక లక్ష్యాల నిర్దేశర జరుగుతుందని ఆశించారు. తీరా కేటాయింపులను చూసి వర్ధమాన దేశాలు పెదవి విరిచాయి. తీవ్ర నిరసననూ తెలిపాయి. సంపన్న దేశాలు తమ కష్టనష్టాలను పట్టించుకోకుండా తోచినంత విదిలిస్తున్నాయని అవి మండిపడుతున్నాయి. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ఏటా 1.3లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక సాయం అవసరమని పేద దేశాలు స్పష్టంచేస్తున్నాయి. కానీ, కాప్-29లో ధనిక దేశాలు 30 వేల కోట్ల డాలర్లతో సరిపెట్టాయి. అది కూడా 2035 నుంచి అందిస్తామని మెలిక పెట్టాయి. ఇది అరకొర మొత్తమేనని భారత్ సైతం గట్టిగా నిరసించింది. నైజీరియా, క్యూబా, బొలీవియా, చిన్న ద్వీప రాజ్యాల సంఘం, ఆఫ్రికా గ్రూపు, అల్పాదాయ దేశాల సంఘం కూడా నిరసన గళం విప్పాయి. సంపన్న రాజ్యమైన కెనడా కూడా పేద దేశాలతో గొంతు కలపడం విశేషం. వాతావరణ్గ ÷నాన్స్ సమస్య ఇకముందూ రగులుతూనే ఉండే అవకాశం కనిపిస్తోంది. సంపన్న దేశాలు 2020 నుంచి వాతావరణ్గ ÷నాన్స్ కింద ఏటా 10 వేల కోట్ల డాలర్లు ఇస్తామని వాగ్దానం చేశాయి. 2022లో సదరు లక్ష్యాన్ని అందుకున్న ఆ దేశాలు 2025 వరకు దీన్ని కొనసాగిస్తామన్నాయి. ఇప్పుడు తమ సాయాన్ని 30వేల కోట్ల డాలర్లకు పెంచుతున్నామనీ, అదీ ఉదారంగా ఇస్తున్నదేనని వాదిస్తున్నాయి. వాస్తవానికి 2030కల్లా 50వేల కోట్ల డాలర్ల సాయం అందిస్తామని అవి మొదట్లో ప్రతిపాదించాయి. అది చివరికి 30వేల కోట్ల డాలర్లకు తగ్గింది. వచ్చే ఏడాది బ్రెజిల్‌లో జరిగే కాప్-30 సభలో వార్షిక వాతావరణ ్గ ÷నాన్స్‌ను 1.3లక్షల కోట్ల డాలర్లకు పెంచే విషయం పరిశీలిస్తామన్న మాటతో సరిపెట్టేశారు. వాతావరణ వైపరీత్యాలతో 2049 నాటికి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ఏటా 19 నుంచి 59 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరు-అక్టోబరు మాసాల్లో కేవలం రెండు తుపాన్లతో అమెరికాకు 10వేల కోట్ల డాలర్ల నష్టం సంభవించింది. 2023లో చైనా ప్రకృతి ఉత్పాతాలతో 4200 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టాన్ని చవిచూసింది. పేద దేశాల సంగతి చెప్పనవసరమే లేదు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పేద దేశాలకు ఆర్థిక సాయం కోసం 72 కోట్ల డాలర్లతో నష్టనివారణ నిధిని ఏర్పాటు చేయాలని కాప్-29 నిశ్చయించింది. ఇది ఏ మూలకూ సరిపోదు. అమెరికా 1.75 కోట్ల డాలర్లను నిధికి అందిస్తానని వాగ్దానం చేసింది. అయితే, వాతావరణ మార్పులు బూటకమని వాదించే ట్రంప్ ప్రభుత్వం రానుంది. దీంతో ఆ కొద్ది సాయమైనా అందేది అనుమానమే. ప్రపంచంలో పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి సామర్థ్యాన్ని 2030కల్లా మూడు రెట్లు పెంచాలనేది కాప్-29 లక్ష్యం. కానీ, శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యేక తీర్మానం చేయకపోవడం గమనార్హం. దీనివల్ల సంపన్న దేశాలు బొగ్గు, చమురును యథేచ్ఛగా వినియోగిస్తాయనే ఆందోళన వ్యక్తమైంది. వాతావరణ మార్పుల నిరోధానికి సంపన్న, వర్ధమాన దేశాలు ఒక్కతాటిపై నడవడం తప్పనిసరి. ఈ విషయంలో ఏకాభిప్రాయం లోపించడం కాప్-29లో స్పష్టంగా కనిపించింది. ఇక, ఇప్పుడు భూగోళం ఒక ప్రమాదపు అంచున ఉంది. ఇక వెనక్కు తీసుకోలేనంతగా వాతావరణ మార్పులు జరుగు తున్నాయి. ఇది ఇక ఒక్క ధనిక దేశాల సమస్య మాత్రమే కాదు. అయితే వారి దృష్టి అంతా ఇప్పుడు ఉక్రెయిన్‌లో రష్యాను ఏ విధంగా సైనికంగా ఓడించాలి, చైనాను ఆర్థికంగా ఎట్లా చుట్టుముట్టాలి అనేదే. పాలస్తీనాలో మానవ హననం జరిగినా సరే. చమురు సమృద్ధిగా వున్న పశ్చిమాసియాను లొంగదీసుకోవడానికి ఇజ్రాయిల్‌ను ప్రయోగించడం, మిగిలిన ప్రపంచంపై ఆధిపత్యం చలాయించడం ఎలా? అన్నదే వారి ఆసక్తి.ఇదే వారి సూత్ర బద్ధత (రూల్ బేస్డ్ ఆర్డర్). జి7 దేశాలు, ప్రకృతి నియమాలకే కాదు. ఇతర దేశాలకు కూడా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయి. తమ పెత్తనాన్ని నిలుపుకోవడానికి గుప్పెడన్ని ధనిక దేశాలు అందరి భవిష్యత్తును ఫణంగా పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక మెరుగైన ప్రపంచాన్ని ఏ విధంగా నిర్మించుకోవాలనేది పెద్ద సవాలు.

## సర్వేలో సీఎం వివరాలు నమోదు

హైదరాబాద్, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు. ఎన్యుమరేటర్‌లు, అధికారులు ఆయన వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వే పురోగతిపై సీఎం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి స్పందన ఎలా ఉందని ఆరా తీశారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

# బంగ్లాదేశ్ లో మైనార్టీలను తరిమివేసే విద్వేష క్రీడ!

సెంట్రల్ డెస్క్: ఈ ఏడాది జులైలో ప్రధాని షేక్ హసీనా అధికారం నుంచి వైదొలిగిన నాటి నుంచి బంగ్లాదేశ్ లోని హిందూ మైనార్టీలు లక్ష్యంగా తీవ్ర స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. హసీనాను దించివేసే క్రమంలో మొదలైన అల్లర్లు, దారుణాలు పెరుగుతున్నాయే కానీ తగ్గ లేదు. హిందవులు లక్ష్యంగా ఈ అల్లర్లు సాగుతూనే ఉన్నాయి. ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ ఆ దేశంలో మైనారిటీల దుస్థితికి తాజా ఉదాహరణ. మైనారిటీల హక్కుల కోసం గళం విప్పే దాస్ బంగ్లాదేశీ జాతీయ పతాకాన్నిఅవమానించారంటూ దేశద్రోహ నేరం మోపారు. ఆయనను అరెస్ట్ చేసి, బెయిలివ్వకుండా కస్టడీకి పంపారు. అంతేకాదు, అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం(ఇస్కాన్)పై నిషేధం విధించనున్నట్టు బంగ్లా సర్కార్ ప్రకటించింది. ప్రస్తుతం ఆ పక్రియ కొనసాగుతోందని అటార్నీ జనరల్(ఏజీ) వెల్లడించారు. ప్రభుత్వం ఇస్కాన్ ని మత సంస్థగా పేర్కొంది. చిన్మయ్ అరెస్టు నేపథ్యంలో ఈ ప్రకటన తీవ్ర దుమారం రేపుతోంది. ఇస్లాం అధికారిక మతమైనా, లౌకికవాద, ప్రజాస్వామ్య దేశంగా, సమానత్వానికి రాజ్యాంగ బద్ధులమని చెప్పుకొనే బంగ్లా ఆ మాటకు తగ్గట్టు వ్యవహరించడం ఎప్పుడో మానేసింది. అందుకు తగ్గట్టే తాజాగా 'ఇస్కాన్'ను ర్యాడికల్, మత ఛాందసవాద సంస్థ అని బంగ్లా అటార్నీ జనరల్ అభివర్ణించడం ఆందోళనకరం. ఆధ్యాత్మిక చైతన్యం, పీడిత జన సముద్ధరణ కోసం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాల్లో పనిచేస్తున్న ఒక సంస్థపై అలాంటి నిర్ణయం తీసుకోవాలనుకోవడం బుద్ధిలేని పని. మరోవైపు, చిన్మయ్ అరెస్టును భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు పాకిస్థాన్‌ను తలపిస్తోందని అధికార బీజేపీ నేతలు మండిపడుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ÷-రస్తుతం బంగ్లాదేశ్‌లోభారత్‌పై వ్యతిరేక ప్రచారాన్ని పెంచే కార్యక్రమం నడుస్తోంది. తీవ్రవాద శక్తులను ప్రోత్సహించడం వంటివి బంగ్లాదేశ్‌ను పూర్తి అరాచక రాజ్యంగా మారుస్తున్నా యన్నారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం చర్యలే ఇందుకు కారణమని చెప్పాలి. హిందూ, బౌద్ధ దేవాలయాలపై దాడులు తరచూ జరుగుతున్నాయి. దేశంలో ఏదో ఒక చోట మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. షేక్ హసీనా రాజీనామా అనంతరం.. గతంలో నిషేధానికి గురైన 'బంగ్లాదేశ్ జమాతే ఇస్లామి' వంటి తీవ్రవాద సంస్థలు మళ్లీ రెచ్చిపోతున్నాయి. ఈ తీరును చూస్తుంటే మైనార్టీ వ్యతిరేక భావజాలం పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. హసీనా వెళ్లిపోయిన తర్వాత బంగ్లాదేశ్‌లో రాజకీయ శూన్యత ఏర్పడింది. అదే సమయంలో తీవ్రవాద సంస్థలు మళ్లీ రెచ్చిపోతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వీటిలో విదేశీ జోక్యం ఉందనే వారి వాదనను కొట్టిపారేయలేము. ఢాకాలోని పాక్ రాయబార సంస్థ ముందు చోటుచేసుకుంటున్న కార్యకలాపాలు ఇందుకు ఉదాహరణ.




కొన్ని తీవ్రవాద సంస్థలతో పాకిస్థాన్ సన్నిహితంగా మెలుగుతోందనేది బహిరంగ రహస్యం. మైనారిటీలను పూర్తిగా తరిమేసి, బంగ్లాను హిందూ రహిత దేశంగా మార్చాలనే కుట్ర దీని వెనక ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ అల్లర్లు, అల్పసంఖ్యాక హిందువులపై దాడుల వెనుక మత ఛాందస జమాతే ఇస్లామీ ఉందనేది స్పష్టం. హసీనా సర్కారు కాలంలో నిషేధానికి గురైన ఈ ర్యాడికల్ గ్రూపు, అలాగే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)లు యూనస్ యంత్రాంగంలో భాగమే. అసలు ఈ ప్రయత్నమంతా ఇస్లామిక్ షరియత్‌ను ప్రవేశపెట్టి, బంగ్లాదేశ్‌ను ప్రజాస్వామ్య ఎన్నికలు, పార్లమెంట్‌తో పని లేని దేశంగా మార్చాలనే వ్యూహంలో భాగమని ఒక వాదన వినిపిస్తోంది. మరోవైపు, జూలై నాటి ప్రజా ఉద్యమంతో ఆఫ్ఘనిస్తాన్ లాగానే బంగ్లాను తమ ప్రయోగశాలగా చేసుకోవాలని పాశ్చాత్య ప్రపంచం భావిస్తున్నట్టుంది. అప్పుడిక బంగ్లా మరో తీవ్రవాద కేంద్రంగా మారే ప్రమాదముంది. అది భారత్‌కే కాదు... యావత్ ప్రపంచానికి నష్టం. నిజానికి, ఆసియా ? పసిఫిక్ కూటమిలో బంగ్లాను భాగం చేసుకొని, లబ్ధి పొందాలని అమెరికా భావించింది. హసీనా సర్కార్ అందుకు ఒప్పుకోకపోవటంతో అది కుదరలేదు. మొన్నటి అమెరికా ఎన్నికల్లో ట్రంప్ గెలవడం బంగ్లాకు చెడు పరిణామం. మధ్యంతర సర్కార్ సారథి ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ కు ట్రంప్ ద్వేషి గా పేరుంది. ట్రంప్ పగ్గాలు చేపట్టాక బంగ్లాపై కఠినవైఖరి అవలంబిస్తారని యూనస్‌కు తెలుసు. అందుకే, ఆలోగా మైనారిటీలపై అల్లర్లను ఆఖరి అస్త్రంగా చేసుకున్నారనే వాదన కూడా ఉంది. 1930లో బంగ్లాలో 30 శాతం పైగా ఉన్న హిందువులు ఇప్పుడు కేవలం 8 శాతానికి పడిపోయారనే వాస్తవం అక్కడ జరుగుతుందో చెప్పకనే చెబుతోంది. ప్రాణ భయంతో బతుకుతున్నఅక్కడి హిందువులను కాపాడేందుకు భారత ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిం చాల్సివుంది. కేవలం మాటలకు పరిమితం కాకుండా చేయగలిగినదంతా చేయాలి. యూనస్ సర్కార్‌పై అంతర్జాతీయంగానూ ఒత్తిడి తేవాలి.

# ఇజ్రాయెల్,గాజా మధ్య బాంబుల మోత

గాజా: ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య యుద్ధం తారాస్థాయికి చేరింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇజ్రాయెల్, గాజా మధ్య బాంబుల మోత మోగుతోంది. తాజాగా హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థ ఇజ్రాయెల్‌పై రాకెట్స్ వర్షం కురిపించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 250 రాకెట్స్‌ను ఇజ్రాయెల్‌పైకి ఎక్కుపెట్టింది. హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థ చరిత్రలో ఇదొక అతిపెద్ద దాడిగా ఆ సంస్థ ప్రకటించింది. ఇప్పటికే లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకుపోయిన ఇజ్రాయెల్.. అక్కడ వరుస దాడులతో హమాస్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టింది. హమాస్ అనుబంధ సంస్థ అయిన హెజ్బొల్లాను కూడా అంతమొందించేందుకు ఇజ్రాయెల్ కంకణం కట్టుకున్నట్లు యుద్ధం చేస్తోంది. అందులో భాగంగానే హెజ్బొల్లా మిలిటెంట్స్‌కు గట్టి పట్టున్న దక్షిణ బేరూట్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో డజన్ల కొద్ది పౌరులు చనిపోయారు. భారీ అంతస్తుల భవనాలు నేలకూలాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారి సంఖ్య ఎంతో కూడా కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. హెజ్బొల్లాకు స్థావరాలు లేకుండా చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ చేసిన ఈ దాడికి హెజ్బొల్లా ప్రతీకారంతో రగిలిపోయింది. ఇక సమయం వృథా చేసి లాభం లేదనే నిర్ణయానికొచ్చిన హెజ్బొల్లా మిలిటెంట్స్... ఈసారి గోడౌన్లోంచి రాకెట్స్ బయటికి తీశారు. ఒకదాని తరువాత మరొకటి అన్నట్లు ఏకకాలంలో ఇజ్రాయెల్‌లోని నాలుగు లక్ష్యాలను టార్గెట్ చేస్తూ 250 రాకెట్స్‌ను ప్రయోగించారు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఆష్దోదా నేవల్ బేస్ లక్ష్యంగా హెజ్బొల్లా ఈ మిస్సైల్స్ దాడి జరిపింది. వెంటనే టెల్ అవివ్‌లోని మిలిటరీ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని అడ్వాన్స్‌డ్ రాకెట్స్ ప్రయోగించింది. అదే సమయంలో నగరానికి మరో వైపున ఉన్న గ్లిలాట్ ఆర్మీ ఇంటెలిజెన్స్ స్థావరంపై కూడా రాకెట్స్ గురిపెట్టింది. హెజ్బొల్లా వైపు నుండి 250 రాకెట్స్ దాడి జరిగినట్లుగా ఇజ్రాయెల్ డిఫెన్స్ వర్గాలు కూడా అంగీకరించాయి. హెజ్బొల్లా చేసిన మిస్సైల్స్ దాడుల్లో ఇదే అతిపెద్ద దాడిగా ఇజ్రాయెల్ రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన రాకెట్స్‌లో కొన్నింటిని ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ విజయవంతంగా తిప్పికొట్టింది. ఇంకొన్ని రాకెట్స్ సెంట్రల్ ఇజ్రాయెల్‌పై పడ్డాయి. ఈ రాకెట్స్ ఎటాక్‌లో కొన్ని ఇళ్లు ధ్వంసమైనట్లుగా అసోసియేటెడ్ ఫ్రాన్స్ ప్రెస్ వెల్లడించింది. ఇంకొన్ని రాకెట్స్ ఏకంగా ఇజ్రాయెల్‌కి అతి ముఖ్యమైన టెల్ అవీవ్ నగరం వరకు చేరుకున్నాయని ఆ వార్తా సంస్థ తెలిపింది. ఇక్కడ కూడా రాకెట్స్ దాడిలో కొన్ని భవనాలు శిథిలమైనట్లు తెలుస్తోంది. ఏడుగురు గాయపడినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ వర్గాలు చెబుతున్నాయి. తాజా దాడులకంటే కొద్ది రోజుల ముందే హెజ్బొల్లా వైపు నుండి ఇజ్రాయెల్‌కు కాల్పుల విరమణకు ఒక ప్రతిపాదన వెళ్లింది. కానీ ఇజ్రాయెల్ అప్పుడు ఆ ప్రతిపాదనను లైట్ తీసుకుంది. అయితే, ఇటీవలే నెదర్లాండ్స్‌లోని ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. ఇజ్రాయెల్ మాజీ డిఫెన్స్ చీఫ్ గల్లంట్ యోవ్‌కు కూడా ఈ అరెస్ట్ వారెంట్ జారీ అయింది. యుద్ధం పేరుతో లెబనాన్ గడ్డపై బెంజమిన్ నెతన్యాహు, గల్లంట్ సాగించిన మారణకాండను ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు తప్పుపట్టింది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు చేసిన ఈ వ్యాఖ్యలతో ప్రపంచ దేశాల ముందు నెతన్యాహు ఒక దోషిలా నిలబడాల్సి వచ్చింది. హెజ్బొల్లా ప్రయోగించిన 250 రాకెట్స్ దాడి తరువాత తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని కాల్పుల విరమణ ఒప్పందానికి సూత్ర ప్రాయంగా అంగీకరించినట్లు సీఎన్ఎన్ తెలిపింది. అయితే, ఈ కాల్పుల విరమణకు కొన్ని షరతులు విధించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇప్పటికే ఇజ్రాయెల్ తమ ఆధీనంలోకి తీసుకున్న భూభాగాన్ని తిరిగి ఇచ్చేందుకు బెంజమిన్ నో చెప్పినట్లు తెలుస్తోంది.

## బంగ్లాదేశ్‌లో హిందూ నాయకుడు అరెస్ట్

న్యూఢిల్లీ, బంగ్లాదేశ్?లోని హిందూ నాయకుడు చిన్మోయ్ కృష్ణదాస్?ను అరెస్ట్ చేయడం, ఆయనకు బెయిల్ నిరాకరించడంపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్?లోని హిందువులు, మైనార్టీలకు భద్రత కల్పించాలని అధికారులను కోరింది. చిన్మోయ్ కృష్ణదాస్ అరెస్టుకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్?లో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న మైనార్టీలపై దాడులు ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. "బంగ్లాదేశ్ సమ్మిలిత్ సనాతన్ జాగ్రన్ జోటే ప్రతినిధి, హిందూ నాయకుడు చిన్మోయ్ కృష్ణదాస్?ను అరెస్టు చేయడం, బెయిల్ నిరాకరించడం పట్ల తీవ్ర ఆందోళనతో ఉన్నాం. బంగ్లాదేశ్?లో మైనార్టీల ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడులు జరిగాయి. అలాగే చోరీలు, దేవతా విగ్రహాలు, దేవాలయాలు ధ్వంసం జరిగాయి. వాటికి సంబంధించి అనేక కేసులు నమోదయ్యాయి. అలాంటి సంఘటనలకు పాల్పడినవారు పరారీలో ఉన్నారు. శాంతియుతంగా న్యాయబద్ధమైన డిమాండ్లను కోరే హిందూ నాయకుడిపై ఆరోపణలు చేయడం దురదృష్టకరం" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. బంగ్లాదేశ్?లో చిన్మోయ్ కృష్ణదాస్?ను అరెస్ట్ చేయడంపై ఇశా ఫౌండేషన్ అధినేత జగ్గీ వాసుదేవ్ స్పందించారు. "ప్రజాస్వామ్యయుత దేశం మతతత్వ, నిరంకుశ దేశంగా మారడం వల్ల ఎలా విచ్ఛిన్నమవుతుందో చూస్తున్నాం. ప్రజాస్వామ్యం విలువలను అర్థం చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. మతం, జనాభా ఆధారంగా హింసించడం ప్రజాస్వామ్య దేశాల మార్గం కాదు. దురదృష్టవశాత్తు మన పొరుగు దేశం ప్రజాస్వామ్య సూత్రాలను వదిలేసింది. పౌరులందరికీ వారి అవసరాలు, నమ్మకాల ప్రకారం జీవించే హక్కు ఉంది. అలాంటి ప్రజాస్వామ్య దేశాన్ని తిరిగి నిర్మించడం బంగ్లాదేశ్?లోని ప్రతి పౌరుడి బాధ్యత" అని జగ్గీ వాసుదేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ నాయకుడు చిన్మయ్ కృష్ణదాస్ అక్టోబరు 30న బంగ్లాదేశ్?లోని ఢాకాలో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరచారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో చిన్మయ్ కృష్ణదాస్?పై కేసు నమోదు చేసిన పోలీసులు, ఢాకాలోని హజ్రత్ షాజలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్?లో సోమవారం అరెస్టు చేశారు. దాస్?ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు డిటెక్టివ్ బ్రాంచ్ ప్రతినిధి రెజాల్ కరీం తెలిపారు. ఛటోగ్రామ్ పోలీస్ స్టేషన్?కు చిన్మయ్ కృష్ణదాస్?ను అప్పగించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు, హిందూ నాయకుడు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును పలు హిందూ సంఘాలు ఖండించాయి. ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశాయి.

## పాకిస్థాన్‌లో హింసాత్మకంగా నిరసనలు

ఇస్లామాబాద్, పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్ -ఏ- ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలంటూ ఆ పార్టీ మద్దతుదారులు చేపట్టిన భారీ నిరసన హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలో నలుగురు పారామిలిటరీ సిబ్బంది, ఇద్దరు పోలీసులు మృతి చెందారు. దాదాపు 100మంది సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారు. నిరసనలు హింసాత్మకంగా మారడం వల్ల, రాజధాని ఇస్లామాబాద్ ప్రాంతంలో ప్రభుత్వం భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసింది. కనిపిస్తే కాల్చేయమని ఆర్మీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ముందు జాగ్రత్తగా రాజధాని ఇస్లామాబాద్?లోని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు.మంగళవారం కూడా పీటీఐ మద్దతుదారుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్, రావల్పిండికి వెళ్లే ప్రధాన రహదారులను మూసివేసిన ప్రభుత్వం, పెద్దఎత్తున భద్రతబలగాలను మోహరించింది.

# ఏపీలోని మరిన్ని ఆలయాలకు దీప, ధూప నైవేద్యాలు

తిరుమల, ఏపీలోని మరిన్ని ఆలయాలకు ధూప, దీప నైవేద్యం కింద నిధులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఆలయాలకు ఇస్తున్న నిధులను రెన్యూవల్ చేశామని తెలిపారు. గురువారం తిరుమలలో మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంగనాయకుల మండపంలో పండితులు వారిని శాలువలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీవారి దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. తిరుమల మఠాల అక్రమాలపై టీటీడీ పాలకమండలి దృష్టి సారించిందని తెలిపారు. తిరుమలలో నాలుగు మాసాల్లోనే చాలా మార్పు వచ్చిందని అన్నారు. భవిష్యత్‌లోను ఆలయాన్ని దర్శించి భక్తులకు సౌకర్యాల కల్పనను పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం ధూప,దీప నైవేద్యాలకు ఇస్తున్న రూ. 5వేలను , కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ. 10 వేలకు పెంచి ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,400 ఆలయాలకు ధూప, దీప నైవేద్యానికి నిధులు ఇస్తున్నామని వెల్లడించారు.

# జమ్మలమడుగులో ఉద్రిక్తత

కడప జిల్లా, జమ్మలమడుగులో నియోజక వర్గ పరిధిలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఆర్టీపీపీ నుంచి ఫ్లైయాస్ పౌడర్ తాడిపత్రికి తరలించే విషయంలో జేసీ బ్రదర్స్ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. రెండు రోజులుగా ఇరు వర్గల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఆ చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. అటు తాడిపత్రి నుంచి జేసీ వర్గీయులు మళ్లీ వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా పోలీసు బలగాలు మోహరించాయి. అనంత పురం, కడప జిల్లా బోర్డర్ అయిన కొండాపురం మండలంలో చెక్ ఫోస్ట్ ఏర్పాటు చేశారు. ఆర్టీపీపీ నుండి ఫ్లయాస్ పౌడర్‌ను తాడిపత్రికి తరలించే విషయంలో జేసీ బ్రదర్స్ ఆదినారాయణ వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. కాగా జేసీ దివాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి.. ఇద్దరూ కూటమి నేతలే కావడం విశేషం. జేసీ దివాకర్‌రెడ్డి తాడిపత్రికి చెందిన టీడీపీ నాయకుడు, ఆదినారాయణరెడ్డి బీజేపీ ఎమ్మెల్యే. వీళ్లిద్దరి మధ్య ఫ్లైయాష్ తరలింపునకు సంబంధించిన ఒప్పందంపై విభేదాలు తలెత్తాయి. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోకి ఆర్టీపీపీ వస్తుంది. దీంతో తమ నియోజకవర్గంలో ఏం జరిగినా తమ కనుసన్నల్లోనే జరగాలని ఆదినారాయణరెడ్డి భావిస్తున్నారు. అయితే తాడిపత్రి నియోజకవర్గంలోని సిమెంట్ పరిశ్రమలకు ఆర్టీపీపీ నుంచి జేసీ దివాకర్‌రెడ్డి వర్గీయుల వాహనాలు ఫ్లైయాష్ తరలిస్తున్నాయి. దీనిపై ఒప్పందం కుదరకపోవడంతో జేసీ దివాకర్‌రెడ్డి వాహనాల్ని ఆర్టీపీపీకి ఎట్టి పరిస్థితుల్లో రానివ్వకూడదని ఆదినారాయణరెడ్డి వర్గీయులు పంతం పట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం జేసీ దివాకర్‌రెడ్డి వాహనాలు ఆర్టీపీపీకి వస్తున్నాయని తెలిసి, ఆర్టీపీపీ సమీపంలోని కలమల్ల వద్ద ఆదినారాయణరెడ్డి వర్గీయులు భారీగా మోహరించారు. వస్తే అడ్డుకోడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ బందోబస్తు ఏర్పాటు చేశారు. బూడిద తమ దగ్గర ఉంది కాబట్టి తమ వాహనాలతో తరలిస్తామని ఆదినారాయణరెడ్డి వర్గీయులు అంటున్నారు. కానీ తరలించేది తాడిపత్రికి కాబట్టి తమ వాహనాల్లోనే తీసుకువస్తామని జేసీ ప్రభాకర్ రెడ్డి అంటున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య పంచాయతీ పెరిగిపోయింది. దీంతో జేసీ వాహనాలు వస్తే అడ్డుకుని తీరుమామని ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అంటున్నారు.

# ఈ స్ట్రాటజీ తప్పనిసరి

హైదరాబాద్,ఒక పార్టీకి హవా పెరిగితే ఆపే శక్తి ఎవరికీ ఉండదు. అయితే ఆ హవా తీసుకురావడమే కీలకం. కాంగ్రెస్ అంటేనే ఒక అపవాదు ఉంటుంది. ఎవరికి వారే ఉంటారు. ఎవరి ఆట వారే ఆడుతారని. అలాంటి కాంగ్రెస్ లో అందరినీ ఒక్కతాటిపైకి తేవడం కీలకం. అప్పుడే విజయానికి దగ్గరి దారి సాధ్యమన్న సూచనలు వస్తున్నాయి. ప్రతి ఓటమి విజయానికి మెట్టుగా చేసుకుంటేనే భవిష్యత్ అంటున్నారంతా. మరి హస్తం పార్టీ స్ట్రాటజీలు మారుస్తుందా?కింద పడిన ప్రతిసారీ అంతకు రెట్టింపు వేగంతో లేవాలి. ఫస్ట్ కాంగ్రెస్ లో ఇది అలవాటు చేసుకోవాలన్న సూచనలు పెరుగుతున్నాయి. లక్ పైనే అన్ని ఆశలు పెట్టుకోవడం ఆపేయాలని, మైనస్ పాయింట్స్ ను గుర్తించడం, తమ తప్పుల్ని సరి చేసుకోవడం, కిందిస్థాయి నాయకత్వానికి స్వేచ్ఛ ఇవ్వడం, ప్రజలకు భరోసా వస్తేనే ఆశీర్వదిస్తారన్నది గుర్తుంచుకోవడం ఇవన్నీ కీలకంగా మారుతున్నాయి. మొన్నటి లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు రాబట్టుకుంది. కేరళ, పంజాబ్, తెలంగాణ, నాగాలాండ్, మేఘాలయ, లక్షద్వీప్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అదనపు సీట్లు వచ్చాయి. బీజేపీని కాంగ్రెస్ నేరుగా ఎదుర్కొన్న చోట వెనుకబడిపోయింది. సార్వత్రిక ఎన్నికల నుంచి కాంగ్రెస్ కు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. హర్యానాలో ఓటమి, మహారాష్ట్ర, జమ్మూ కాశ్మీర్‌లో పేలవప్రదర్శన ఓ సవాల్ గా మారింది. మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడి కూటమి కింద పోటీ చేసిన 101 సీట్లలో కేవలం 16 స్థానాల్లో మాత్రమే హస్తం పార్టీ గెలిచింది. స్ట్రైక్ రేట్ 16 శాతంగానే ఉండిపోయింది. అదే లోక్‌సభ ఎన్నికల సమయంలో మహారాష్ట్రలో 76 శాతం స్ట్రైక్ రేట్ సాధించారు. అక్కడి కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే కూడా ఓడిపోయారు. మహారాష్ట్రలో పోటీ చేసిన 17 ఎంపీ సీట్లలో 13 గెలుచుకుంది. దానికి, ఇప్పటి అసెంబ్లీ ప్రదర్శనకు పూర్తి రివర్స్ గా ఫలితం వచ్చింది. సో దీన్ని కచ్చితంగా డీకోడ్ చేసుకోవాలంటున్నారు.జార?ండ్‌లో INDIA కూటమి విజయం సాధించినా.. క్రెడిట్ ఎక్కువగా జార?ండ్ ముక్తి మోర్చాకు దక్కింది. ఎందుకంటే పోటీ చేసిన 43 సీట్లలో 34 గెలిచి 79 శాతం స్ట్రైక్ రేట్ సాధించింది. అటు కాంగ్రెస్ 30 సీట్లలో పోటీ చేసి 16 సీట్లను గెలుచుకుని 53 శాతం స్ట్రైక్ రేట్‌ను మాత్రమే సాధించింది. నిజానికి మహారాష్ట్ర వంటి వ్యూహాత్మకంగా ముఖ్యమైన రాష్ట్రంలో ఓటమి అంటే పెద్ద ఎదురు దెబ్బే. ఇక వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, నవంబర్ లో బిహార్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండూ కాంగ్రెస్ కు అగ్ని పరీక్షగా మారబోతున్నాయి. అప్పటికైనా సెట్ అవ్వాలంటే ఇప్పటి నుంచే దీర్ఘకాల వ్యూహాలు అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.కేవలం అదానీ ఇష్యూ, కులగణన, బీజేపీ అవినీతి చేస్తోందని ఇలాంటివి పట్టుకుని వెళ్తే ఉపయోగం ఉండబోదని, ప్రజా మద్దతును ఎన్నికల విజయాలుగా మార్చగల బలమైన సంస్థాగత నిర్మాణం అవసరం అంటున్నారు. సో ఇలాంటి సూచనలు పెరగడంతో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించిన కాంగ్రెస్ ఢిల్లీ ఎన్నికల తర్వాత భారీ సంస్థాగత పునర్నిర్మాణం చేపట్టాలని డిసైడ్ కూడా అయింది. 2022లో ఉదయ్‌పూర్ చింతన్ శిబిర్‌లో అలాగే 2023లో జరిగిన రాయ్‌పూర్ ప్లీనరీలో కాంగ్రెస్ తాము ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించింది.ప్రచారంలో క్రియేటివిటీ పెంచడం, కొత్త కొత్త పథకాలకు ఆలోచన

# ఏపీ ప్రయోజనాలే ప్రాధాన్యంగా ఢిల్లీ టూర్



అమరావతి:దేశవ్యాప్తంగా అందరి కళ్ళూ ఏపీ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ వైపే చూస్తోన్నాయి. మహారాష్ట్రలో విజయం తరువాత బీజేపీ కొత్త వ్యూహాలకు పదును పెట్టే సమయాన పవన్ ఢిల్లీలో అడుగుపెట్టడం సరికొత్త ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈక్రమంలోనే ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న పవన్ ఢిల్లీలో ప్రధాని మోదీతో ప్రత్యేకంగా సమావేశమై సుమారు అర్ధగంటకు పైగానే చర్చించారు. ఎన్డీఏ భవిష్యత్ రాజకీయ వ్యూహాల్లో పవన్ పాత్ర కీలకం కానుందనే అంచనాలతో ఈ భేటీ ఆసక్తిని పెంచుతోంది.రాష్ట్ర ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ పర్యటించిన పవన్ కృషిని విశ్లేషకులు, మేధావులు మెచ్చుకుంటున్నారు. ఈ సందర్భంలో గత పాలకుల ఐదేళ్ళ పాలనలో అప్పటి సీఎం ఢిల్లీ వెళ్ళిన ప్రతీసారీ రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి%ౌ% వ్యక్తిగత ప్రయోజనాలకే సమయాన్ని కేటాయించినట్లు గుర్తుచేసుకోవడం గమనార్హం.

భుజం తట్టి ప్రశంసించిన మోదీ

మరోవైపు మోదీ ఏపీ అభివృద్ధి ముఖచిత్రం మార్చేందుకు పవన్ కళ్యాణ్ చొరవను అభినందిస్తూ భుజం తట్టారు. మహారాష్ట్రలో ఎన్డీఏ మహాయుతి గెలుపు 'పవన్' ప్రభంజనంతోనే సాధ్యమైందని.. సూపర్ ఆంధీ ప్రభావాన్ని మరోమారు దేశం మొత్తం చూసిందన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్నిరకాలుగా అండగా ఉంటుందని మోదీ స్వయంగా పవన్ కి హామినివ్వడం గమనార్హం.

సంతృప్తికరంగా రెండ్రోజుల ఢిల్లీ టూర్

పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన బిజీగా చాలా అర్ధవంతంగా జరిగింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో పవన్ సమావేశమయ్యారు. ఏపీకి సంబంధించిన అంశాల పైన చర్చలు చేశారు. పర్యాటకం, జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులకు పలు విజ్ఞాపనలు అందజేశారు.ఎన్డీఏ భాగస్వామ్య పక్ష నేతగా పవన్ కు కేంద్రం మంత్రుల నుంచి సానుకూల స్పందన కనిపించింది. పవన్ అభ్యర్థనల పైన కేంద్ర మంత్రులు పలు అంశాలపై వెంటనే స్పందించి ఆమోదం తెలిపారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి చేయూతనివ్వాలని, జలజీవన్ మిషన్ గడువు పొడిగించాలని, ఏపీలో పర్యాటకాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తోనూ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తొలిరోజు పర్యటనలో పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ శెకావత్ దృష్టికి పవన్ కళ్యాణ్ ఏడు అంశాలను తీసుకెళ్లారు. కేంద్ర పర్యాటక శాఖ 'స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ ప్యాకేజీ కింద రాష్ట్రం ప్రతిపాదించిన గండికోట, అఖండ గోదావరి, సూర్యలంక బీచ్‌లకు 250 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. అరకు, లంబసింగిల్లో ఎకో టూరిజం, ఎడ్వెంచర్ కేటగిరీలోకి వచ్చే పర్యాటక ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలన్నారు.గోదావరి బ్యాక్ వాటర్‌లో హౌస్‌బోట్లు, నది తీరంలో చక్కటి వసతి ఏర్పాట్లతో కోనసీమ అభివృద్ధికి చేయూతనివ్వాలన్నారు. ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకంలో అరసవల్లి, మంగళగిరి ఆలయాలను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో నిర్మించతలపెట్టిన అత్యాధునిక పర్యాటక భవన్‌కు కేంద్ర పర్యాటక శాఖ ఎంవోటీగా 80 కోట్లు విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ గ్లోబల్ పర్యాటక మార్కెటింగ్‌లో ఏపీని తప్పనిసరిగా ప్రమోట్ చేయాలని కోరారు.పర్యాటక రంగంలో విద్యార్థులకు నైపుణ్యాలను అందించేలా జాతీయ పర్యాటక విశ్వవిద్యాలయాన్ని ఏపీలో నెలకొల్పాలని వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో బ్లూఫాగ్ బీచ్‌లు పెంచడానికి కేంద్రం నిధులిచ్చి సహకరించాలని కోరారు.గ్రామీణ రహదారుల అభివృద్ధి :తర్వాత కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్‌ను కలిసి ఏపీలో జల్‌జీవన్ మిషన్ పథకం అమలు కాలాన్ని 2027 వరకు పొడిగించాలని కోరారు. 2019-24 మధ్య అందించిన కనెక్షన్లలో కుళాయిల సామర్థ్యం, నీటి నాణ్యత అంశంలో ఇటీవల సర్వే నిర్వహించినట్లు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 29.79 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందలేదని, 2.27 లక్షల పంపులు పని చేయడం లేదని గుర్తించినట్లు చెప్పారు.గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం వల్ల ఈ పథకంలో 2 వేల కోట్ల రూపాయలే ఏపీ వాడుకుందని, ఇంకా 16 వేల కోట్లు వాడుకోవాల్సి ఉందన్నారు. ఆ నిధులు ఉపయోగించుకోవడానికి సహకరించాలని కోరారు.తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన పవన్ ఏపీలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నుంచి తీసుకునే రుణంలో వెసులుబాట్లు కల్పించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ఏఐఐబీ నుంచి తీసుకున్న రుణానికి ప్రాజెక్టు గడువును రహదారి ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు ఇచ్చిన గడువును 2026 డిసెంబర్ వరకు పొడిగించాలని కోరారు. ఇందుకోసం బిల్లులు రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో కాకుండా ముందుగానే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ఏఐఐబీ గతంలో ఒప్పుకున్న ప్రకారం 3 వేల 834.52 కోట్ల రూపాయలు మంజూరు చేసేలా చూడాలని విన్నవించారు

లాతూరు నుంచి తిరుపతికి రైలు

పిఠాపురంలో రైల్వే లెవెల్ క్రాసింగ్ స్థానంలో ఆర్వోబీని ప్రధానమంత్రి గతిశక్తి కార్యక్రమం ద్వారా మంజూరు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి కోరారు. పిఠాపురంలోని శ్రీపాద వల్లభస్వామి దేవాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం నాందేడ్ %-% సంబల్పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్, నాందేడ్-విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం- సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్‌లకు పిఠాపురంలో హాల్ట్ ఇవ్వాలని కోరారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో మహారాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా లాతూరు నుంచి తిరుపతికి రైలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

2021 నుంచి నిధులు అందలేదు

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, అంగన్‌వాడీ, వ్యవసాయ ఉత్పత్తుల గిడ్డంగులు, మహిళా స్వయం సహాయక సంఘాల భవనాలకు అంచనా వ్యయం నిధులను పెంచాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు పవన్ విజ్ఞప్తి చేశారు.గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లోని అంతర్గత దారులు కూడా బాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. 100 జనాభా దాటిన గ్రామాలకు సైతం అనుసంధాన రోడ్లు వేసుకునేందుకు పథకంలో చోటు కల్పించాలన్నారు. రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ ప్రోగ్రాం కింద కేంద్రం నుంచి రాష్ట్రానికి 2021 నుంచి నిధులు అందలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌ను పవన్ కోరారు.

రూ.113.751 కోట్లు విడుదలకు కేంద్ర ఉత్తర్వులు

ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక అభివృద్ధికి నూతనోత్తేజం వచ్చింది. తొలిరోజు ఢిల్లీ టూర్ లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ను కలిసిన పవన్ కళ్యాణ్ 'సాస్కి 2024-25(స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్మెంట్)' పై విజ్ఞాపన పత్రం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి షెకావత్ ఏపీ పర్యాటక రంగానికి ఊతమిస్తూ 'సాస్కి' పథకానికి తొలి విడతగా రూ. 113.751 కోట్లు (66శాతం) విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పవన్ అడిగిందే తడవుగా కేంద్రమంత్రులు ఏపీ రాష్ట్ర ప్రయోజనాలు నెరవేర్చడం శుభపరిణామం. ఈక్రమంలో పవన్ కళ్యాణ్ చొరవను అభినందిస్తూ సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# టీచర్లపై సర్వే భారం.. విద్యార్థులకు శిరోభారం



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల (సమగ్ర ఇంటింటి కుటుంబ) సర్వే చివరి అంకానికి చేరుకుంది. ఈ సర్వే ఉద్దేశం రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ అంశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం. వాటిని అమలు చేయడానికి ఈ సర్వే దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తుంది. ఇది మంచి పరిణామమే అయినప్పటికీ, ఈ విద్యా సంవత్సరం మధ్య భాగంలో ఈ సర్వేను చేపట్టడం, అందులో ఎస్‌జీటీ ఉపాధ్యాయులనే ఈ సర్వేలో పాల్గొనేలా చేయడం జరిగింది. దీనివల్ల ప్రాథమిక విద్య నష్టపోతుందని చెప్పడంలో ఫోర్త్ ఎస్టేట్, ప్రతిపక్షాలు, ఉపాధ్యాయ సంఘాలు, పేరెంట్స్ కమిటీలు సరైన పాత్రను పోషించలేదనేది వాస్తవం.ప్రభుత్వ ఆదేశానుసారం ఎస్‌జీటీ ఉపాధ్యాయులు సర్వేలో అనేక కష్టాలు పడుతూ పలుచోట్ల ఎన్యుమరేటర్లకు ఎదురు ప్రశ్నలు వేసినా, ఛీత్కారాలు, చీవాట్లు, అమానుషం గా వారిపై కుక్కలతో దాడి చేయించినా, కూర్చోవడానికి కుర్చీలు ఇవ్వకున్నా, 75 ప్రశ్న లను బుక్‌లోని కోడ్లతో క్రోడీకరిస్తూ ఫార్మ ట్ నింపడం జరిగింది. ఒకపూట బడి చెప్తూ మిగతా కాలంలో సర్వేను పూర్తి చేసి చివరి అంకానికి చేరారు. వాస్తవంగా ఉపాధ్యాయులను బడికి, బోధనకు దూరం చేయరాదనే నిబంధన ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా వారిపై అదనపు భారం మోపారు.

సర్వే అయిపోయిందనుకుంటే..

ఏదేమైనా ఒక వ్యవస్థను అంచనా వేయడానికి ఇంకో వ్యవస్థను బలిపీఠం ఎక్కించడం భావ్యం కాదు! ఇలాంటివి వేసవి సెలవుల్లో చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వాలు వాస్త వాలు గ్రహించి ప్రాథమిక విద్య పటిష్టతకు పూనుకొని ముందుకు సాగాలి. ప్రాథమిక పాఠశాలలు గత కొన్ని రోజులుగా సర్వే పేరుతో ఒంటిపూట బడులు మాత్రమే నడుస్తున్నాయి. ఇక సర్వే చివరి దశకు చేరుతోంది. ఇక పూర్తి సమయం చదువులకు కేటాయించుకోవచ్చు అని ఊహించుకునే తరుణంలో ఆన్లైన్ డేటా కూడా ఉపాధ్యాయులు దగ్గరుండి చేయించాలంటున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే "మూలిగే నక్కపై తాటి పండులా" మారుతుంది పరిస్థితి. ప్రాథమిక పాఠశాల విద్య పటిష్టతకు ఇవన్నీ భంగకరంగా మారతాయి. దీనివల్ల మళ్లీ కొన్ని రోజుల పాటు బడులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు దూరమయ్యే పరిస్థితి తప్పదు. తద్వారా ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థులు శాశ్వతంగా దూర మయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

ప్రమాదపుటంచున ప్రాథమిక విద్య

వీటిపై ఏ ఉపాధ్యాయ సంఘం నోరు మెదపకపోగా, ఖాళీగా ఏర్పడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోటీ పడి ఓటర్ల నమోదు, ప్రచారంలో తలమునకలై ఉన్నా రు. కంటితుడుపు చర్యగా పేపర్ స్టేట్మెంట్స్ ఇచ్చి ఊరుకుంటున్న తీరు బాధ్యతారాహి త్యం కాదా? ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోవడమే నిర్లక్ష్యానికి కారణమా? పైపెచ్చు ప్రాథమిక విద్య ప్రమాద పుటంచుల్లో ఉన్నా.. అంతే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తారా? ఒక్కసారి ఆలోచించండి. ఈరోజు ప్రాథమిక పాఠశాలలు మూసివేస్తే రేపు ఉన్నత పాఠశాలలు మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఏ సంఘం కూడా ఆలోచిం చకపోవడం గమనార్హం. ఇప్పటికైనా సంఘ నాయకులందరూ కళ్లు తెరవండి. పాలకులారా.. ప్రాథమిక విద్యకు రాబోవు ప్రమాదాన్ని గుర్తించి డేటా ఎంట్రీ వర్క్‌ను ఉపాధ్యాయులకు కేటాయించకుండా చూ డాల్సిన బాధ్యతనైనా భుజాలపై వేసుకోండి.

చేయని నేరాలకు టీచర్లకు శిక్షలా?

ఒకవైపు సర్వే జరుగుతున్నప్పుడే గ్రామ కార్యదర్శి, సూపర్ వైజర్లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, విద్యాధికారులు, ఎంపీడీవో, కలెక్టర్ లాంటి ఉన్నతాధికారులు సర్వేపై ట్రైనింగ్‌లో సరైన అవగాహన కల్పించకపోగా, పర్యవేక్షణ పేరుతో దినవారీ టార్గెట్ పెంచుకుంటూ వేగంగా చేయాలంటూ ఎస్‌జీటీలపై మానసిక ఒత్తిడి చేసినది కాదనలేని నిజం. ఒకవైపు విద్యార్థులను, ఉపాధ్యాయులను చదువులకు దూరం చేసి పర్యవేక్షణ పేరుతో ఎస్‌జీటీలను మనోవేదనకు గురిచేయబోతుంది. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు వేసి విద్యార్థుల అభ్యసన స్థాయి పర్యవేక్షణకు పూనుకోబోతుంది. ఎస్‌జీటీ ఉపాధ్యాయులు చేయని నేరానికి శిక్షలు అనుభవించాల్సిందేనా! ఇలా విద్యా సంవత్సరంలో అనేక బోధనేతర పనులను అప్పగిస్తూ ఉపాధ్యాయులను బలిపీఠం ఎక్కించడం భావ్యం కాదు? వెంటనే ప్రభుత్వం ప్రాథమిక విద్యను పటిష్ట పరచడానికి ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించి పూర్తి సమయాన్ని బోధన వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది.

## దక్షిణ కొరియాలో భీకర హిమపాతం

సియోల్,దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలో.. వరుసగా రెండో రోజు తీవ్ర స్థాయి హిమపాతం కురిసింది. దీంతో ఆ నగరం అంతా మంచు దుప్పటి పరిచినట్లు అయ్యింది. డజన్ల సంఖ్యలో విమానాలను రద్దు చేశారు. బోట్లు కూడా రద్దు అయ్యాయి. చలి తీవ్రత తట్టుకోలేక కనీసం అయిదు మంది మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. గడిచిన శతాబ్ద కాలంలో ఇంత భారీ స్థాయిలో హిమపాతం కురవడం ఇది మూడోసారి. రికార్డుల ప్రకారం 1907

# ప్రభుత్వాలపై ఎందుకింత వ్యతిరేకత!

సెంట్రల్ డెస్క్: ఏడాది ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఎన్నికలు జరిగిన పది ప్రధాన దేశాల్లో ఓటర్ల ఆగ్రహమే ఫలితాల్లో కనిపించింది. అమెరికా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, అ÷-ర్జ్గ÷ంటీనా, సోలమన్ ఐలాండ్స్, తైవాన్, ఇండోనేసియా... తో పాటు ఈ ఏడాది మరో 50కి పైగా దేశాల మధ్యా ఓ అరుదైన సారూప్యత ఏర్పడింది. అది, ఈసారి ఎన్నికలకు వెళ్లిన దేశాల్లో 80శాతం ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. ఈ ఏడాది 70కి పైగా దేశాలు ఎన్నికల పరీక్షకు నిలవడంతో 2024ను ప్రజాస్వామ్య సంవత్సరంగా అభివర్ణించారు. భారత్, అమెరికా, యూకే, యూరోపియన్ యూనియన్, జపాన్, రష్యాలాంటి అనేక చోట్ల ఈ ఏడాది ఎన్నికలు జరిగాయి. అంటే... ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ మంది తమ మనసులో మాట వినిపించే సంవత్సరంలా నిలిచిందీ 2024. అయితే ఈ దేశాల్లోని మానవాళి మాత్రం తాము 'బతకలేకపోతున్నాం... పరిస్థితులను మార్చండి... పాలనను మెరుగు పర్చండి' అని నినదించింది. ఖండాలు, దేశాలు, పార్టీలు, నాయకులు, సంస్కృతులు వేరైనా అన్ని దేశాల్లోనూ ప్రజల రియాక్షన్ ఒక్కటే. అమెరికా నుంచి ఇండోనేసియా దాకా ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల తీర్పుల అంతరార్థం ఇదే! మరికొన్ని రోజుల్లో సంవత్సరం ముగుస్తున్న దశలో... అనేక దేశాల్లో ఎన్నికలు ముగిశాయి. వీటిలో కేవలం 20శాతం దేశాల్లో మాత్రమే పార్టీలు అధికారాన్ని నిలబెట్టుకున్నాయి. మిగిలిన అన్ని చోట్లా అధికారంలో ఉన్నవారికి ప్రజలు చుక్కలు చూపించారు. వ్యతిరేక ఓటుతో గ్దదె దించారు. యూకేలో దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీని ఇంటికి పంపించారు. న్యూజిలాండ్‌లో లేబర్ పార్టీ, జపాన్‌లో ఎల్‌డీపీ, దక్షిణాఫ్రికాలో ఏఎన్‌సీ, తాజాగా అమెరికాలో డెమోక్రాట్లను తిరస్కరించారు. దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా పార్టీ ఎఎన్‌సీ... తొలిసారి ఘోర పరాజయం పాలైంది. అమెరికాలో అధికారంలో ఉన్న పార్టీ వరసగా ఓడిపోవటం వందేళ్లలో ఇదే తొలిసారి. ఒబామా తర్వాత డెమోక్రాట్లు, ట్రంప్ తర్వాత రిపబ్లికన్లు, మళ్లీ ఇప్పుడు బైడెన్ తర్వాత డెమోక్రాట్లు ఓడిపోయారు. నాలుగేళ్ల కిందట వద్దనుకున్న, అనేక కేసులు ఎదుర్కొంటున్న డొనాల్డ్ ట్రంప్‌నే మళ్లీ అమెరికా ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించుకున్నారంటే వారిలో ప్రస్తుత ప్రభుత్వ తీరుపై ఎంత వ్యతిరేకత గూడుకట్టుకుందో తెలిసిపోతోంది. ఒండాల సరిహద్దులను చెరిపేసుకొని ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ఈ ట్రెండ్ చెబుతున్నదేంటి? భౌగోళిక రాజకీయాలు, యుద్ధాలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, వలసలు... అన్నీ కలిసి రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు, అస్తవ్యస్త పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అవి అన్ని దేశాల్లోనూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. మరోవైపు ఉద్యోగాలు ఊడుతుండటం, జీతాలు తగ్గుతుండటం... ప్రజలను అనిశ్చితిలోకి నెట్టాయి. ఫలితమే ప్రభుత్వాలపై వ్యతిరేకత! ప్రపంచవ్యాప్త వ్యతిరేకత! మరి కొత్త నాయకత్వాలు ప్రజల తీర్పును ఎంతవరకు గౌరవిస్తాయనేది చూడాల్సివుంది.

# దిలావర్‌పూర్ అసలు నిజాలు ఇవే!

హైదరాబాద్,లగచర్ల ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన జిల్లా కలెక్టర్‌పై దాడికి పాల్పడడం జాతీయస్థాయిలో చర్చకు దారి తీసింది. ఇందులో బీఆర్ఎస్ కుట్ర ఉందని పోలీసులు తేల్చారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని ఏ1గా పేర్కొంటూ అరెస్ట్ చేశారు. అయితే, ఇదే తీరుగా నిర్మల్ నియోజకవర్గం దిలావర్‌పూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ, స్థానిక ప్రజలు రోడ్డెక్కారు.చాలా రోజులుగా ఈ నిరసనలు జరుగుతున్నా, రెండు రోజులుగా తీవ్రతరం అయ్యాయి. నిర్మల్ ఆర్డీవో కారుపై దాడికి ప్రయత్నించారు స్థానికులు. అలాగే, పోలీసులపైనా దాడులకు తెగబడ్డారు. అయితే, చేయాల్సిందంతా చేసి బీఆర్ఎస్ పార్టీ ప్రజలను ఉసిగొల్పేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండడంపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమంటున్నారు. నిజానికి దిలావర్‌పూర్‌లో తిరగబడింది బీఆర్ఎస్‌పైనే అంటూ కౌంటర్ ఇస్తున్నారు. ఇంతకీ, అసలేం జరిగింది.

కేసీఆర్ ప్రభుత్వంలో అనుమతులు

నిర్మల్ జిల్లాలో ఉంటుంది దిలావర్‌పూర్. గోదావరి నదిపై ఉన్న శ్రీ రామ్ సాగర్ ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉంటుంది. ప్రాజెక్ట్ ఎగువన ఉండే దిలావర్‌పూర్, గుండంపల్లి మధ్యలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు బీఆర్ఎస్ హయాంలో 2022 ఏప్రిల్‌లో మంజూరు చేసుకుంటే 2023 ఏప్రిల్‌లో అనుమతులు వచ్చాయి. దీన్ని విత్తనాల ఫ్యాక్టరీగా ప్రచారం చేసి భూసేకరణ చేశారన్న ఆరోపణలున్నాయి. ఆ సమయంలో 4 గ్రామాల ప్రజల నుంచి 60 ఎకరాల దాకా భూములు తీసుకున్నారు. ఈ ల్యాండ్ పూలింగ్ అంతా భయపెట్టి, తక్కువ ధరకు తీసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీని వెనుక అప్పటి మంత్రి కీలకంగా వ్యవహరించారని, అన్నీ దగ్గరుండి అనుమతులు వచ్చేలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూములు ఇవ్వని వారిని భయపెట్టడం, అరెస్టులు చేయడం వంటివి జరిగాయని బాధితులు చెబుతుంటారు.

ప్రభుత్వం మారడంతో న్యాయం కోసం ప్రజల పోరాటం

పదేళ్లు పాలించిన కేసీఆర్‌ను ఇక చాలు అంటూ 2023 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ప్రజల్లో ధైర్యం పెరిగింది. ఇథనాల్ ఫ్యాక్టరీ తమ భూముల్లో వద్దంటూ నిరసనకు దిగారు ప్రజలు. చాలా రోజులుగా నాలుగు గ్రామాల ప్రజలు ఏకమై, ఇథనాల్ పరిశ్రమ వద్దంటూ ధర్నాలు చేస్తున్నారు. రద్దు చేసేంతవరకు తమ పోరాటం ఆగదని ప్రతిన బూనారు.ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో తమ పంట పొలాలతో పాటు పర్యావరణం సైతం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు వారితో చర్చలు జరిపేందుకు ప్రయత్నించారు. నిర్మల్ ఆర్డీవో గ్రామానికి వెళ్లగా కొందరు రెచ్చిపోయారు. కారుపై దాడికి ప్రయత్నించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వారిపై కూడా దాడికి పాల్పడడంతో టెన్షన్ వాతావరణం ఏర్పడింది.

ప్రభుత్వ సానుకూల ప్రకటన

ప్రజల నిరసనలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. ఇథనాల్ ఫ్యాక్టరీపై పునరాలోచిస్తామని ప్రకటించింది. గ్రామస్తులపై జిల్లా కలెక్టర్ అభిలాష మాట్లాడారు. ఫ్యాక్టరీ పనులు నిలిపివేస్తున్నట్టు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నట్టు చెప్పారు.

కంపెనీకి డైరెక్టర్‌గా బీఆర్ఎస్ నేత తలసాని సాయి కిరణ్

వివాదాస్పదమైన ఈ ఇథనాల్ కంపెనీకి సంబంధించి సంచలన వాస్తవాలు బయటపడుతున్నాయి. గతంలో ఫ్యాక్టరీకి అనుమతులు పొందింది పీఎంకే డిస్టిలేషన్స్ లిమిటెడ్. ఈ కంపెనీకి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు తలసాని సాయి కిరణ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. అనుమతులు పొందే సమయంలో ఆయన డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయనతోపాటు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ కూడా డైరెక్టర్‌గా ఉన్నారు. రూ.222.80 కోట్ల వ్యయంతో నిర్మల్ జిల్లాలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది.అయితే, ఏ పరిశ్రమో చెప్పకుండా భూములు తీసుకున్నారనేది రైతుల వాదన. ఈ ఫ్యాక్టరీ వల్ల ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్ కలుషితం అవుతుందని పర్యావరణవేత్తలు కూడా చెబుతున్నారు.

# బూడిద కోసం సై అంటే సై అంటున్న టీడీపీ నేత, బీజేపీ ఎమ్మెల్యే..!




అమరావతి, ఇలాఖ పంచాయితీ ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఏ బిడ్డా ఇది నా అడ్డా అని ఆ ఇద్దరు నేతలు రచ్చకెక్కడం పొలిటికల్ హాట్ టాపిక్ అవుతోంది. అంతటితో ఆగకుండా బూడిద రగడ రచ్చకెక్కింది. ఓ టీడీపీ నేత, బీజేపీ ఎమ్మెల్యే డస్ట్ కోసం నువ్వా నేనా అన్నట్లుగా తగ్గేదేలే అంటున్నారు. టీడీపీ నేత అయితే ఏకంగా తానే రంగంలోకి దిగుతానంటుంటే..బీజేపీ ఎమ్మెల్యే మాత్రం అనుచరులను ఫీల్డ్‌లోకి దింపి రచ్చ చేస్తున్నారు. ఆ రెండు రాయలసీమ జిల్లాల సరిహద్దుల్లో పోలీస్ పహారా..టెన్షన్ సిచ్యువేషన్స్‌తో ఆ ఇద్దరి కుస్తీ కాస్త..డిస్కషన్ పాయింట్ అవుతోంది. ఇంతకీ ఆ ఇద్దరి బూడిద గొడవ ఏంటి.? డస్ట్ వార్ సెట్ అయ్యేది ఎట్లా.?

జేసీ, ఆది వర్గాల మధ్య వివాదం..

అప్పుడు దోస్తీ.. ఇప్పుడు కుస్తీతో ఆ ఇద్దరి నేతల పంచాయితీ రచ్చ రంబోలా అవుతోంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మధ్య గొడవ చూస్తుంటే ఇదే అనిపిస్తుంది. రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి ఫ్లైయాష్ పౌడర్ తాడిపత్రికి తరలించే విషయంపై జేసీ బ్రదర్స్..ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గాల మధ్య వివాదం నడుస్తోంది. దీంతో నువ్వానేనా అన్నట్లుగా ఫీల్డ్‌లోకే దిగారు ఇద్దరు నేతల అనుచరులు. జేసీ ప్రభాకర్ రెడ్డి అయితే తానే రంగంలోకి వస్తానని చెప్పి హీట్ క్రియేట్ చేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాత్రం అనుచరులతోనే తతంగమంతా నడిపిస్తున్నారు.

ఫ్లైయాస్ పౌడర్ తాడిపత్రికి తరలించే విషయంపై గొడవ

%రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌లో ప్రతీ నిత్యం దాదాపు 4వేల టన్నుల ఫ్లైయాష్ పౌడర్ ఉత్పత్తి అవుతుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో బూడిదను అప్పటి జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి సిమెంటు ఫ్యాక్టరీలకు సప్లై చేసే వారట. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు బూడిద తోలుకోవడం స్టార్ట్ చేశారు. ఈ మధ్య ఆదినారాయణరెడ్డి వర్గీయులు అడ్డు చెప్పడంతో వివాదం మొదలైంది. ఆదినారాయణరెడ్డి వర్గీయులు సరఫరా చేసే బూడిదను తాడిపత్రి పరిసరాల్లోని సిమెంటు ఫ్యాక్టరీలకు వెళ్లకుండా జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. ఇదే నేపథ్యంలో తాడిపత్రి నుంచి ప్రభాకర్‌రెడ్డి తన వర్గీయులతో ఆర్టీపీపీ దగ్గరకు వస్తారనే సమాచారంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. రెండ్రోజులుగా ఆర్టీపీపీ, తాడిపత్రి మార్గంలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి వర్గీయులు గొడవ పడతారని భావించి నిఘా పెట్టారు. తమ వాహనాల్లో బూడిదను నింపకపోతే ప్రత్యక్షంగా రంగంలోకి దిగుతానంటూ వైఎస్ఆర్ జిల్లా ఎస్పీకి ప్రభాకర్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తత, ఉత్కంఠ ఏర్పడింది.

ముదిరిన బూడిద వివాదం..

ఫ్లైయాష్ తరలింపు విషయంపై ఆదినారాయణరెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గాల మధ్య రెండ్రోజులుగా చర్చలు జరిగాయి. కానీ చర్చలు కొలిక్కి రాలేదు. అంతలోనే వివాదం పెద్దదై ముదిరిపోయింది. జేసీ దివాకర్‌రెడ్డి వాహనాలు ఆర్టీపీపీకి వస్తున్నాయని తెలిసి అక్కడ భారీగా మోహరించారు ఆదినారాయణరెడ్డి వర్గీయులు. పరిస్థితి చేయిదాటిపోతే రెండు వర్గాలు..ఇద్దరు నేతలు ఆర్టీపీపీ దగ్గర ఎదురెదురు పడే అవకాశం ఉందని భావించిన పోలీసులు..అనంతపురం, కడప జిల్లా బోర్డర్ అయిన కొండాపురం మండలంలో చెక్‌పోస్ట్ పెట్టారు. దాంతో ఆ గట్టున జేపీ వర్గీయులు..ఈ గట్టున ఆది వర్గీయులు అన్నట్లుగానే కంటిన్యూ అవుతోంది పరిస్థితి.

ఆది వర్గం లారీలు తాడిపత్రికి వస్తే ఊరుకునేది లేదంటున్న జేసీ వర్గం..

బూడిద తమ దగ్గర ఉంది కాబట్టి తమ వాహనాలతో తరలిస్తామని ఆదినారాయణరెడ్డి వర్గీయులు అంటున్నారు. కానీ తరలించేది తాడిపత్రికి కాబట్టి తమ వాహనాల్లోనే తీసుకెళ్తామని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గం వాదిస్తోంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పంచాయతీ పెరిగిపోయింది. జేసీ వాహనాలు వస్తే అడ్డుకుని తీరుతామంటూ ఆదినారాయణ రెడ్డి వర్గీయులు తగ్గేదేలే అంటున్నారు. ప్రస్తుతానికి పోలీసులు పహారా పెట్టి గొడవ జరగకుండా చూస్తున్నారు. కానీ జేసీ ప్రభాకర్‌రెడ్డి లారీలు వెళ్తే ఎమ్మెల్యే ఆది వర్గం అడ్డుకునే అవకాశం ఉంది. ఆది నారాయణరెడ్డి లారీలు తాడిపత్రికి వస్తే ఊరుకునేది లేదంటోంది జేసీ వర్గం. దీంతో హైటెన్షన్ సిచ్యువేషన్స్ క్రియేట్ అయ్యాయి.

బూడిద వివాదం కూటమి పెద్ద నేతల దాకా వెళ్లినట్లు టాక్..

ఈ ఇద్దరి ఇష్యూతో మధ్యలో పోలీసులు నలిగిపోతున్నారట. ఏ నేత వర్గం అనుచరులను ఏమన్నా..తమకు తలనొప్పిగా మారిందని భావిస్తున్నారట ఖాకీలు. అయితే బూడిద పంచాయితీ పెద్దది అయి..హడావుడి కావడంతో వివాదం కూటమి పెద్దనేతల దాకా వెళ్లినట్లు టాక్ వినిపిస్తోంది. కూర్చొని మాట్లాడుకుని ఏదో ఒకటి సెటిల్ చేసుకోవాలని..రోడ్డుకు ఎక్కి రచ్చ చేయొద్దని ఇద్దరు నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ డస్ట్ గొడవ సమసిపోతుందా.? ఇద్దరు నేతల ఇలానే రాస్తా పే సవాల్ అని పంచాయితీకి దిగుతానే ఉంటారా అనేది వేచి చూడాలి.

# రాష్ట్రంలో మాఫియా సామ్రాజ్యం...



అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం పరిస్థితులు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే హస్తిన వేధికగా జగన్ దేశానికి వినిపించేలా నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరిస్థితులు రోజు రోజుకీ మరింత అధ్వాన్నంగా తయారవుతున్నాయంటూ తాజాగా తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.అవును... రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో బాధాకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయని.. ఎన్నికల నాడు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, రాష్ట్రంలో స్కాంల పాలన నడుస్తోందని.. ఎక్కడ చూసినా పేకాట క్లబ్బులు కనిపిస్తున్నాయని.. రాష్ట్రంలో మాఫియా సామ్రాజ్యం నడుస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విరుచుకుపడ్డారు.తన పాదయాత్రలో కష్టాలను చూసి.. అందుకు తగ్గట్టుగా గత ఐదేళ్ల పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని.. ప్రతీ ఇంటికీ మంచి చేశామని జగన్ తెలిపారు. అయితే.. ఇప్పుడు మాత్రం ఆ అడుగులు వెనక్కి పడుతున్నాయని.. అది ఎలా జరుగుతుందో చూస్తున్నే ఉన్నామని జగన్ పేర్కొన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం తిరోగమనంలో ఉందని అన్నారు.రాష్ట్రంలో గత ఐదేళ్లలో విప్లవాత్మక అడుగులు పడ్డాయని చెప్పిన జగన్.. ఇప్పుడు మాత్రం ఎక్కడ చూసినా లిక్కర్, ఇసుక స్కాంలతో పాటు పేకాట క్లబ్ లు కనిపిస్తున్నాయని.. ఇది చాలా బాధాకరమైన పరిస్థితి అని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ తో భరోసా ఇవ్వలేకపోగా.. రెడ్ బుక్ పాలనతో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని జగన్ ఫైరయ్యారు.ఎన్నికల నాడు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా సాకులు చెబుతున్నారని.. సూపర్ సిక్స్ లు కనిపించడం లేదని.. ఎన్నికలప్పుడు చెప్పిన మాటలు కనిపించడం లేదని.. రెడ్ బుక్ పరిపాలనలో రాజ్యాంగానికి తూట్లు పొడవడం మాత్రమే కనిపిస్తోందని జగన్ విరుచుకుపడ్డారు.తమ పాలనలో ప్రజలకు మంచి చేయాలనే అడుగులు ముందుకు పడ్డాయని.. ఎన్నడూ ఊహించని మార్పులు తీసుకురాగలిగామని.. ప్రతీ గ్రామంలోను సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చామని.. లంచాలు, వివక్ష లేకుండా ప్రతి పథకం ఇంటి వద్దకే డోర్ డెలివరీ ఇచ్చామని జగన్ తెలిపారు. ఇదే సమయంలో... బడ్జెట్ లో క్యాలెండర్ ఇచ్చి మరీ పథకాలను అమలు చేశామని చెప్పిన జగన్... ఇదంతా వైసీపీ ప్రభుత్వ పాలనలో మాత్రమే జరిగిందని గుర్తు చేశారు! కూటమి పాలనలో మాత్రం బెల్ట్ షాపులు, పేకాట క్లబ్బు మాత్రం కనిపిస్తున్నాయని దుయ్యబట్టారు.

# విశాఖను భయపెడుతున్న డయేరియా కేసులు..



అమరావతి, మహా విశాఖ నగర పాలక సంస్థలో డయేరియా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో చాలావరకు భయాందోళనలు నెలకొన్నాయి. విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం నగరంలో డయేరియా కేసులు ఒక్కసారిగా 13 నుంచి 16 వరకు నమోదయ్యాయి. దీంతో నగరంలో భయాందోళనలు మొదలయ్యాయి. సాధారణంగా చలికాలం మొదట్లో, వర్షాకాలం మధ్యలో ఎక్కువగా డయేరియా కేసులు నమోదు అవుతుంటాయి. అయితే ఈ శీతాకాలం సీజన్లో ప్రస్తుతం 16 కేసులు నమోదు అవడంతో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా ఎందుకు 16 కేసులు నమోదు అయ్యాయనే విషయం మీద ఇప్పటికే విచారణ మహా విశాఖ నగర పాలకసంస్థ (జీవీఎంసీ) పరిధిలో 98 వార్డులు ఉన్నాయి. ఈ 98 వార్డుల్లో మురికివాడలనేవి చాలా తక్కువగా ఉన్నాయి. 98 వార్డుల్లో 15 నుంచి 20 కి లోపే వేళ్లపై లెక్కపెట్టుకునేలా మాత్రమే మురికివాడల్లో నివసించే ప్రజలు ఉంటున్నారు. అటు గాజువాక నుంచి ఇటు భీమిలి వరకు చాలా వరకు ప్రాంతాల్లో శానిటేషన్ సిబ్బంది అప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు చేపడుతూ వస్తుంది. ముఖ్యంగా ఉదయం ఇళ్ల వద్ద చెత్తలు తీసే దగ్గరనుంచి సాయంత్రం వరకు చాలా ప్రాంతాల్లో నిల్వ నీరు లేకుండా చేస్తోంది. ఇక డయేరియా ఎక్కువగా వచ్చేది నిల్వనీరు, మురుగునీటి వల్లేనన్న సంగతి తెలిసిందే. ఈ అపరిశుభ్ర నీటిని ఆశ్రయించి దోమలు, ఈగలు వంటి కీటక జాతి పుడుతుంది. ఇందులో కొన్ని రకాల దోమల వల్ల డయేరియా కేసులు వచ్చే అవకాశం నేపథ్యంలో ప్రస్తుతం అన్నిచోట్ల కూడా శానిటేషన్‌ను తీవ్రతరం చేసింది జీవీఎంసీ. ప్రస్తుతం విశాఖపట్నం, గోపాలపట్నం అలాగే 104 ఫోర్ ఏరియా ప్రాంతంలో డయేరియా కేసులు నమోదయ్యాయి. దాదాపు 16 వరకు కేసులు నమోదైనట్టు అధికారికంగా అధికారులు ధృవీకరించారు. వీరందరికీ చికిత్స అందిస్తున్నారు. వీరిలో 13 మందికి ప్రస్తుతం ఏ ప్రాణాపాయం లేదని, కోలుకున్నారని అధికారులు చెబుతున్నారు. మరో ముగ్గురు పరిస్థితి కాస్త ఇబ్బందిగా ఉన్నప్పటికీ వారు కూడా కోలుకుంటారని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జగదీశ్వరరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డయేరియాకి గురైన 16 మంది బాధితులను విశాఖ కెజిహెచ్ కి తరలించి ప్రత్యేక వైద్యం అందించారు. చికిత్స అందించి 13 మందిని ఇప్పటికే ప్రాణాపాయం లేకుండా చేశారు. మిగతా ముగ్గురిని కూడా రేపు డిశ్చార్జ్ చేస్తామని ఎవరికీ ప్రాణాపాయం లేదని డిఎంహెచ్‌వో జగదీశ్వరరావు చెబుతున్నారు. అయితే ఇది ఎందువల్ల వచ్చిందనే విషయం మీద ఇప్పటికే విచారణ చేశామని, వీళ్లందరికీ ఫుడ్ పాయిజన్ వల్ల మాత్రమే డయేరియా వచ్చిందని అంటున్నారు. ముఖ్యంగా దోమల కారణంగా ఏ డయేరియా కేసు నమోదు కాలేదని, కేవలం ఫుడ్ పాయిజన్ వల్ల మాత్రమే ఈ 16 కేసులు నమోదయ్యాయని అంటున్నారు. ఇవి కూడా రేపు సాయంత్రం కల్లా మొత్తం క్లియర్ అయిపోతాయని డిఎంహెచ్‌వో జగదీశ్వరరావు చెబుతున్నారు.


# కొత్తగా మద్యం పాలసీని ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొత్తగా మద్యం పాలసీని ప్రవేశపెట్టింది. కొత్తగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చి చేరింది. కొత్త మద్యం పాలసీలో భాగంగా కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలకు గాను 3045 దరఖాస్తులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కొత్తగా మద్యం పాలసీని ప్రవేశపెట్టింది. కొత్తగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చి చేరింది. కొత్త మద్యం పాలసీలో భాగంగా కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలకు గాను 3045 దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు జిల్లా మద్యం దుకాణాల టెండర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు 60,90,00,000 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చి చేరింది. అయితే ఈ మద్యం అమ్మకాలకు సంబంధించి టెండర్ల ద్వారా లైసెన్సులు పొందిన వ్యాపారస్తుల మాత్రమే మద్యం అమ్మకాలు చేపట్టేలా చర్యలు చేపట్టినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుంది. మరోవైపు కర్ణాటక బార్డర్ సమీప గ్రామాల్లో అక్రమ మద్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. దీంతో గ్రామీణ ప్రాంతంలో తాగడానికి సరైన మంచి నీరు లేకపోయినా మద్యం మాత్రం ఏరులై పారుతుందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాకు పక్కనే తుంగభద్ర నది ఉన్నా ఎన్నో దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతంలో తాగడానికి గుక్కెడు మంచినీళ్లు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీళ్ల కోసం కిలోమీటర్ల మేర ప్రయాణించి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి కర్నూలు జిల్లాలో చాలా గ్రామాలకు ఏర్పడిందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రాంతంలో ఈ నీటి సమస్యను మాత్రం తీర్చలేక పోతున్నారన్నారు. కానీ మద్యం



మాత్రం ఏరులై పారుతుంది. దీని ద్వారా రోజంతా కష్టపడి నాలుగు రూపాయలు సంపాదిస్తే అదంతా మద్యానికే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇంట్లో మహిళలు వంటలు వండుకోవడానికి కూడా డబ్బులు మిగలడం లేదని సంపాదించినదంతా మగవారు మద్యానికి బానిసై డబ్బును మద్యానికి వెచ్చేస్తే మూడు పూటలా భోజనం చేసేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నేటికీ తలెత్తుతుందని శ్రీనివాస నగర మహిళలు వాపోయారు. వీటన్నింటికీ కారణం గ్రామీణ ప్రాంతంలో ఆక్రమంగా ఏర్పాటు అయ్యే ఈ బెల్ట్ షాపుల ద్వారానే ఏర్పడుతుందని కాబట్టి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి గ్రామీణ ప్రాంతంలో అదేవిధంగా అక్రమ మద్యాన్ని అమ్ముతున్నటువంటి వారిపై దృష్టి సారించి గ్రామీణ ప్రాంతంలో బెల్ట్ షాపులు లేకుండా అక్రమ మద్యాన్ని అరికట్టాలని మహిళలు కోరుతున్నారు.

# సీనియర్లకు ఇక సెలవేనా ?



అమరావతి,టీడీపీలో సీనియర్లు ఎంతో మంది ఉన్నారు. 1982లో తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించినపుడు పాతికేళ్ల వయసులో ఉన్న వారు ఎంతో మంది పార్టీలో చేరారు. ఆ తరువాత వారే ఎమ్మెల్యేలుగా మంత్రులుగా ఎంపీలుగా కేంద్ర మంత్రులుగా పనిచేసి ఎంతో సేవలను అందించారు.ఇపుడు చూస్తే టీడీపీకి 43 ఏళ్ళ వయసు వస్తోంది. ఆ పార్టీతో పాటే రాజకీయంగా పుట్టిన వారంతా సీనియర్ మోస్ట్ లీడర్లు అయ్యారు వారంతా ఏడు పదులకు చేరువ అవుతున్నారు. కొందరు అయితే ఏడు పదుల వయసుని దాటేశారు కూడా.టీడీపీలో సీనియర్ల పరిస్థితి ఏమిటి అన్నది ఇపుడు చర్చగా సాగుతోంది. 2019 దాకా ఒక వెలుగు వెలిగారు సీనియర్లు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం వారికి పార్టీ విధానం ఏంటి అన్నది కొంత వరకూ అర్థం అయింది. టికెట్ల పంపిణీలోనే జూనియర్లకు కొత్త ముఖాలకు చాలా చోట్ల టికెట్లు ఇచ్చారు. ఇక తప్పదు అనుకున్న చోట అనివార్యమైన చోట మాత్రమే సీనియర్లకు టికెట్లు ఇచ్చారు.మరి కొన్ని చోట్ల సీనియర్ల రాజకీయ వారసులకు టికెట్లు ఇచ్చి వారిని అలా సంతృప్తి పరచారు. అంతే కాదు ఎన్నికల అనంతరం టీడీపీ కూటమి మంత్రివర్గం కూర్పులో చూస్తే జూనియర్లకే పెద్ద పీట వేశారు. అతి తక్కువ మంది మాత్రమే సీనియర్లకు చోటు దక్కింది.ఆ విధంగా తమకు బెర్త్ ఖాయమని అనుకున్న సీనియర్లు అంతా తరువాత పరిణామాలను చూసి కొంత నిరాశ చెందారు. టీడీపీ అధికారంలోకి వస్తే కచ్చితంగా మంత్రులు వీరే అవుతారు అని జనం కూడా ఈజీగా గెస్ చేసే విధంగా ఉండే వారంతా ఇపుడు జస్ట్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోయారు ఇక టీడీపీ కూటమి ఎన్నడూ లేవి విధంగా ప్రభుత్వ విప్ లను పదిహేను మంది దాకా తీసుకుంది. అందులో టీడీపీకి 11 మంది ఉంటే వారిలో కూడా అత్యధికులు కొత్త వారూ మొదటి సారి గెలిచిన వారు కావడం విశేషం.దాంతో సీనియర్లకు స్పష్టంగా ఏదో విధంగా సంకేతాలు అందుతున్నాయని అంటున్నారు. ఒకపుడు పార్టీలో ఐదారుసార్లు గెలిచామని చెప్పుకోవడం క్రెడిట్ అయితే ఇపుడు అదే మైనస్ గా మారుతోంది అని అంటున్నారు. ఎంతో మంది కీలక పదవుల మీద ఆశలు పెట్టుకున్నారు. టీటీడీ చైర్మన్ కూడా పార్టీకి చెందిన వారికి కాకుండా ఒక మీడియా అధిపతికి ఇచ్చారు. దాంతో సీనియర్లు అయితే తమ బాధను చెప్పుకోలేక సతమతమవుతున్నారు అని అంటున్నారు.అయితే మాత్రం వారు ఏమి చేయగలిగే పరిస్థితులలో లేరని అంటున్నారు. ఇపుడు చూస్తే రాజ్యసభ సీట్లు మూడు ఖాళీ అవుతున్నాయి. ఇందులో కూడా సీనియర్ నేతలు పలువురు తమకు చాన్స్ దక్కాలని కోరుకుంటున్నారు. అయితే వారి ఆశలు కూడా హుళక్కి అయ్యేలాగానే ఉన్నాయని అంటున్నారు. ఎందుకంటే సీనియర్లు అంటే ఇక మీదట పార్టీలో సలహాదారులుగా మార్గదర్శకులుగా ఉంటూ నడిపించాల్సి ఉంటుందని అంటున్నారు.అలా పొలిట్ బ్యూరోలో సీనియర్లను ఉంచుతున్నారు. రానున్న రోజులలో అంటే జమిలి ఎన్నికలు వచ్చినా లేదా షెడ్యూల్ ప్రకారం 2029లో ఎన్నికలు జరిగినా కూడా టీడీపీలో నూటికి తొంబై శాతం పైగా కనిపించేది జూనియర్లు కొత్త ముఖాలే అంటున్నారు.దాదాపుగా నాలుగున్నర దశాబ్దాల చరిత్రను కలిగిన టీడీపీ మరో అర్థ శతాబ్దం పాటు ఇదే విధంగా ముందుకు సాగాలీ అంటే అప్పట్లో అన్న గారు యువకులకు పిలిచి టికెట్లు ఇచ్చి పార్టీలో కీలక నేతలను చేసినట్లుగా ఇపుడు కూడా అదే విధంగా చేయాలని చూస్తున్నారు. దాంతో సీనియర్లకు రెస్ట్ తప్పదని అంటున్నారు.ఇక దశాబ్దాలుగా అధికారం అందుకున్న వారు సీనియర్లలో అత్యధికం ఉన్నారు. దాంతో వారు పార్టీకి శ్రేయోభిలాషులుగా అతి ముఖ్య సలహాదారులుగా మారి తమ రాజకీయ ఉత్సాహాన్ని ఆరాటాన్ని ఆ విధంగానే తీర్చుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. మొత్తానికి సీనియర్లకు సెలవా అంటే అదే విధమైన సంకేతాలు అయితే టీడీపీ ఇస్తోంది అని అంటున్నారు.

## విద్యార్థులకు నాణ్యత లేని భోజనం..

హైదరాబాద్,రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గురుకులాన్ని గురువారం మధ్యాహ్నం సందర్శించారు. ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకుంటున్నప్పుడు.. విద్యార్థులకు సరిపడా భోజనం ఎందుకు పెట్టడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. ఆ గురుకులంలో ఉండే విద్యార్థులకు రెండు గిన్నెల నిండా అన్నం వండితే సరిపోతుంది.. కానీ ఒకే గిన్నెలో అన్నం మాత్రమే ఎందుకు వండుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నం ఉడకలేదని, నీళ్ల పప్పు, నీళ్ల చారు ఎందుకు వడ్డిస్తున్నారని ప్రశ్నించారు. మెనూ ప్రకారం వారంలో రెండు రోజులు విద్యార్థులకు నాన్ వెజ్ పెట్టాల్సి ఉండగా, నెలలో ఒకే రోజు నాన్ వెజ్ పెడుతున్నారని తెలిసి గురుకుల సిబ్బందిపై జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులంలోని విద్యార్థుల కోసం 30 లీటర్ల పెరుగు వాడాల్సి ఉండగా, కేవలం ఆరు లీటర్ల పెరుగుతో సరిపెట్టడంపైనా సిబ్బందిని నిలదీశారు. వారానికి ఐదు కోడి గుడ్లు ఇవ్వడం లేదని విద్యార్థులు చెప్పడంతో.. దానిపైనా గురుకుల సిబ్బందిని జీవన్ రెడ్డి నిలదీశారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కానికి ప్రభుత్వం చర్యలు



హైదరాబాద్,ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో పరిష్కారం కావాల్సిన ధరణి సమస్యల కోసం సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ సర్క్యులర్ జారీ చేశారు. ధరణి కమిటీ సూచనల మేరకు మార్గదర్శకాలను జారీ చేసినట్లు భూపరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన సీసీఎల్ఏ ఇచ్చిన సర్క్యులర్‌కు లోబడి ఈ సమస్యలను పరిష్కారం చేయాలని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ స్థాయిలో మ్యూటేషన్, పట్టాదార్ పాస్ బుక్స్, నాలా కన్‌వర్షన్, పట్టాదారు పాస్ పుస్తకంలో సవరణలు తదితరాలు ఉన్నట్లు వివరించారు. అందులో పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు మార్చేటప్పుడు కచ్చితంగా మార్గదర్శకాలను అనుసరించాలన్నారు.తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలన చేసి ఆర్డీవోకు పంపాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎమ్మార్వో దగ్గర నుంచి వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అదనపు కలెక్టర్‌కు ఆర్డీవో అప్‌లోడ్ చేయాలని సూచించారు. తహసీల్దార్, ఆర్డీవోల పరిశీలన తరువాత తనకు వచ్చిన ధరఖాస్తులను సంపూర్ణంగా పరిశీలించి ఆమోదం తెలియచేయడంకాని, తిరస్కరించడం కానీ చేయాలని స్పష్టం చేశారు.అయితే దరఖాస్తు తిరస్కరణ చేసినట్లయితే ఏ కారణం చేత చేస్తున్నారో స్పష్టం చేయాలన్నారు. ఆర్డీవో స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలకు సంబంధించిన పెండింగ్ నాళా, డిజిటల్ సైన్ తదితర వాటిని పరిష్కారం చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆ సర్క్యులర్‌లో అధికారులకు సూచించారు.

## మీ పోరాటాలకు నా సెల్యూట్

హైదరాబాద్,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కొనసాగుతున్న ప్రజల నిరసనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు మహిళల పోరాటానికి సంబంధించిన ఫొటోలను షేర్ చేశారు. వారే తనకు స్ఫూర్తి అంటూ రాసుకొచ్చారు. సమక్క సారక్కలు.. మొక్కవోని ధైర్యంతో ముందుకురుకుతున్న ఐలమ్మలని పేర్కొన్నారు. అలుపెరగని పోరాటం చేస్తున్న రుద్రమ్మలన్నారు. మీ స్ఫూర్తికి సెల్యూట్ చేస్తున్నానని పేర్కొన్నారు. మెరుగైన తెలంగాణ కోసం సోదరుడిగా మీ పోరాటానికి అండగా ఉంటానని ట్వీట్ చేశారు.అబద్ధానికి అంగీ..లాగు వేస్తే అది కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు దేనికి చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ కేటీఆర్ ప్రశ్నించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com